ప్రజాశక్తి

Vol. 3, no. 5

(Aug. 4, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 5

(Aug. 4, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

8 పేజీలు : 0-2-0

PRAJASAKTI

Regd. No. M. 4486

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 | బుధవారం 4-8-43 బెజవాడ | సంచిక 5

పల్నాటిసీమలో కరువు

తినుటకు తిండి, త్రాగుటకు నీరు, లేదు

—కామ్రేడ్ వావిలాల గోపాలకృష్ణయ్య

రాయలసీమ కబుర్లు వింటుంటేనే గుండె నీరైపోతూన్న మనకు మన ప్రాంతాలలోనే కరువు దేవత ప్రత్యక్షమైంది. గుంటూరుజిల్లా పల్నాడు సీమలో, అంటే వినుకొండ పల్నాడు తాలూకాలలోను, సత్తెనపల్లితాలూకా అచ్చమ్మపేట, బెల్లంకొండ ఫిర్కాలలోను, నర్సరావుపేట తాలూకాలో కొమ్మలపాడు, రొంపిచర్ల ఫిర్కాలలోను, కరువు ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే రూపందాలుస్తున్నది. ఈ ప్రాంతాలలో ధాన్యం లభించడంలేదు. పనులు దొరకడం లేదు. పశువులకు మేతలేదు. ఫారెస్టులో మంచిగడ్డిలేదు. ఉన్నా అది లభించుట లేదు. ఇందువలన పశువులను భరించలేక ఏధరకుబడితే ఆధరకు కసాయివారికి అమ్మివేస్తున్నారు.

తిండిలేదు, నీళ్లులేవు, కలరా బయల్దేరింది !

పల్నాడు తాలూకాలో శిస్తులకుగాను పుస్తైపుట అంతా అమ్మివేసి చెల్లించివేశారు. అవిధంగాగూడ చెల్లించలేక తంగెడ, ముత్యాలంపాడు గ్రామాలలో రైతులు రివెన్యూ అధికార్లకు యీ విషయం చెప్పుకోడం, ప్రభుత్వం వారు అప్పులివ్వడం, ఆమొత్తాన్నే శిస్తుక్రింద చెల్లించడం జరిగింది. దాచేపల్లి ఫిర్కాలో ధాన్యమే లభించడంలేదు. దూరదేశంనుంచి ధాన్యం తెచ్చుకు టుంటే దారిలో, గురజాలలో తహసిల్‌దారు బండిఆపి చౌకధరలకు అమ్మివేశాడు పేటసన్నెగండ్లలో తిండిలేకపోతూంటే, పాపం రైతులు తమవద్ద ఉంచుకున్న కొద్ది ధాన్యాన్నిగూడ యింటికొకరోజు వంతున షరీబీదలకు అమ్మివేశారు. మేతలేక పశువులు చస్తున్నవి. అందువల్ల పాడి పూర్తిగా పోయింది. కొన్ని పూళ్ళల్లో ఒక నీళ్ళచుక్క కూడ దొరకడంలేదు.

దాచేపల్లి, వెల్దుర్తి, నదికూడె ప్రాంతాలలో మనుష్యులకు కలరా, పశువులకు చీడరోగం వ్యాపించింది. ఒక మాదినపాడులోనే సుమారు 350 పశువులు, 30 మంది మనుష్యులు చనిపోవడం జరిగింది. స్ఫోటకం విజృంభించింది.

దోపిళ్ళు, వలసలు

సుబ్బారెడ్డిపాలెంలో ఒక దోపిడీ జరిగింది. ఇండ్లలోవున్న కొద్దిధాన్యం లూటీచేయబడ్డది. చరిత్రప్రసిద్ధమైన నాగార్జునకొండ దగ్గరవున్న సుబ్బారెడ్డిపాలెం, పుల్లారెడ్డిగూడెంలలో బీద ప్రజలేగాక మధ్యతరగతి రైతులుకూడా వచ్చిపోయే యాత్రికులు భోజనాలుచేస్తుంటే వారివద్ద తిరిపమెత్తుతున్నారు. అగ్రహారంఅనేగ్రామంలో ఒకకూలి భార్యబిడ్డలు తను తిండిలేకమాడి అడవికివెళ్ళి కట్టెలమోపుతెస్తూ శోషపడ్డాడు. ఎవరో యింతగంజిపోస్తే ప్రాణాలొచ్చాయి. గుత్తికొండవద్ద ధాన్యపుబళ్లను ఆపి ఎవరో దోచుకున్నారు. సుమారు 2500 జనాభాగల తంగెడగ్రామంలో పూరుమొత్తాన 100 బస్తాల గింజలులేవు. ముత్యాలమ్మపాడులో నీరు 5 మైళ్ళనుండీ తెచ్చుకోవాలి. ఈ రెండు గ్రామలనుండి మూడోవంతు జనం తిండి గడవక లేచిపోయారు. మాదినపాడులో 250 అడుగులు బోరింగుచేసినా నీరుపడలేదు. నీరులేక స్నానాలు తొట్టిలో చేస్తే వాటితో గుడ్డలుపుదికి పశువులకు ఆనీరు పెడుతున్నారు. పశునష్టం కలుగుతున్నది.

ఒక గ్రామానికి, మరో గ్రామానికి లడాయి !

ఇక వినుకొండ తాలూకా విషయం. ఈ తాలూకాలో మేళ్ళవాగు, గరికపాడు, రేమిడిచర్ల ప్రాంతాలలో నిరుడంతా అసలేవర్షాలులేవు. ఇంతవరకు యెదలువేయలేదు. (నిత్తుట) వెల్లటూరు ఫిర్కాలో పశువులకు నీరులేదు. లింగముక్కలపల్లి, నూజెండ్ల గ్రామాలలో కలరా ప్రబలింది. జనంనష్టమైనారు. తిండి లేక,వంట్లో పట్టులేక రోగాలకుపాలై ప్రజలు చచ్చిపోతున్నారు. వినుకొండ పట్నంలో అన్నం దొంగతనం కథ పత్రికలలో వినేవున్నారు. పువ్వాడ కొత్తపాలెంలో దోపిడీలు జరిగాయి. ఉప్పాపురంనుండి వినుకొండ చౌకడిపోకు రెవెన్యూ యిన్‌స్పెక్టరు ధాన్యం తీసుకెళుతుంటే, తమకు లేకుండా పోతుందని గ్రామస్థు లాపేశారు. దొంతపాడునుంచి పోయేధాన్యాన్ని ఆపేసి ప్రజలు పోలీస్ రెవెన్యూ అధికార్లకు చెప్పుకున్నారు. అందుపై ఒకగ్రామంనుండి మరొక గ్రామానికి ధాన్యం పోగూడదంటూ గ్రామాలలో టాంటాంవేయడం జరిగి ది పశువులను మేపలేక బెంగుళూరు వ్యాపారస్థులకు అమ్మేస్తున్నారు. మేతదొరకడంలేదు.

నరసరావుపేట తాలూకాలో రొంపిచర్ల, కొమ్మాలపాడు ఫిర్కాలలో ఒకటి రెండు గ్రామాలుతప్ప తిండిలేక, ధాన్యంలేక, వర్షం లేక బాధపడుతున్నారు. పశువులను చంపుకొని, చర్మం, కొమ్ము అమ్ముకొని మాంసం తిని జీవిస్తున్నారు.

రోగాలతో పశువులునశిస్తున్నాయి

సత్తెనపల్లి తాలూకాలో అచ్చమ్మపేట, బెల్లంకొండ ఫిర్కాల్లో సరియైన వర్షాలు లేవు. ఎదలు వేయనేలేదు. గొడ్లకు మేతలేదు. చీడరోగాలు వ్యాపించి పశువులను బలిగొంటున్నవి. ఒక్క వెంకటాయపాలెంలో 600, చిట్యాలలో 100, కోట్లూరులో 200 ఈవిధంగా పశువులు చనిపోయినవి. వ్యవసాయ పశువులు చనిపోయినందున పాడిపశువులను వ్యవసాయానికి వాడుతున్నారు తిండిలేక ఈ పశువులను గూడ వ్యాపారస్థులకు అమ్మేస్తున్నారు. చేయడానికి పనులు లేవు. కొనడానికి ధాన్యం లేదు. క్రిందటిసంవత్సరం పంటలులేవు. పొలిమేరలోవున్న నైజాంలో ఎక్కడన్నా ధాన్యం వున్నా, కంట్రోలువల్ల తెచ్చుకోడానికి వీలు లేదు. ఇంతవరకు ఎదలు పడలేదు.

ఒంగోలుతాలూకా అద్దంకిప్రాంతంలోకూడ కరువు వచ్చే సూచనలున్నవి.

ప్రభుత్వ కర్తవ్యం

ప్రభుత్వం పల్నాడు, వినుకొండతాలూకాలను ఒకటవ తరగతి కరువు నివారణ ప్రాంతాలుగా 2-1-1942 గ. జి. ఓ పి. డబ్ల్యు 4416 ద్వారా నిర్ణయించిరి. కాని తగిన జాగ్రత తీసికొననందున ఈతాలూకాలతోబాటు పరిసరాలు గూడ కరువుకు గురియైనవి. పల్నాటిసీమ మరొక రాయలసీమగా తయారైంది.

కరువురాకుండా వుండటానికి ప్రభుత్వం ప్రాజెక్టుల నిదివరకే ప్రారంభించి వుండాలిసింది. వినుకొండతాలూకాలో కంద్లేరుప్రాజెక్టు, గుండ్లకమ్మప్రాజెక్టు, పల్నాడులో వాడపల్లి, నాగులేరు, దయిదప్రాజెక్టులు, చంద్రవంక ప్రాజెక్టు, సత్తెనపల్లితాలూకాలో పుల్లగూడెం, పులిచింత, యినుకవాగుప్రాజెక్టులు, మైనరు చెరువులు ప్రారంభిస్తే కూలీలకుపని, కరువు రాకుండా రక్షణ అధికాహారోత్పత్తి జరుగుతుంది. పరిస్థితులు విషమించక పూర్వం వెంటనే ప్రభుత్వం కరువు నివారణ పనులు ప్రారంభించాలి. నీరులేని గ్రామాలకు నీటి యేర్పాటులు, అంటువ్యాధులతో అహుతి ఔతున్న గ్రామాలకు ఆటు మనుష్యులకు, యిటు పశువులకు వైద్యసాయం యిచ్చి రక్షించాలి. ప్రజలు, ప్రజాసంఘాలు వెంటనే ముందడుగువేసి ధన, ధాన్య వసూలుచేసి తోటి పల్నాటి సీమ సోదరులను కరువును డి రక్షించుకోవాలి

క్షామపీడితుల వలస

26-7-43న పల్నాటితాలూకా నరసింహారావుపాలెంనుంచి క్షామంవల్ల బాధపడుతూ చేయుటకు పనులులేక, తినుటకు తిండిలేక, ఆకలిజ్వాలల కాగలేక, బీదరైతు, కూలీ కుటుంబాలకు చెందినవారు 30 మంది స్త్రీపురుషులు గ్రామాలవెంట అడుక్కుంటూ కొన్ని గ్రామాల్లో తిండిలేక పస్తులుంటూ, శుష్కించిన శరీరాలతో గుంటూరు తాలూకా పొన్నెకల్లు గ్రామానికి చేరారు. వీరి కరువు బాధను గ్రామంలోని రైతులు తెలుసుకొని గ్రామంలో కొంతధాన్యం వసూలుచేసిపెట్టారు. యింటికొక మనిషిని తీసుకువెళ్ళి ఆరోజు అన్నంపెట్టి పంపించారు. కనుక ప్రభుత్వం వెంటనే కరువుప్రాంతాలలో కరువు పనులు ప్రారంభించి క్షామపీడితులకు అన్నందొరికేట్లు చేయవలసియున్నది.

విశాఖపట్నంజిల్లాలో ఆకలి జ్వాలలు

శ్రీసకాళచంద్రశేఖరపదిగారు ఇల్లా వ్రాస్తున్నారు:-

ఉత్తరవిశాఖపట్నంజిల్లా-సోంపేటమందసా తాలూకాలకు చెందిన యీక్రిందిగ్రామములలో నేనున్నూ, సాహుకారి యీశ్వరప్పచౌదరిగారున్నూ సంచారముచేసితిమి. సువర్ధపురం, గురుదాసుపురం, గుడ్డిభద్ర, రంగోయి, లీలావతి, మాకనపల్లి, బొడ్డపాడు, సర్వేపల్లి, మెట్టూరు, వంకులూరు, గదూరు, సున్నాదేవి, నగరంపల్లి, జల్లిమెరక, నారాయణపురం, గంగువాడ, రాంపురం, లక్షింపురం, బేతలూరు సిగలపుట్టుక, రట్టి, గొల్లలపాలెం, నొల్లూరు, మర్రిపాడు, మామిడిపల్లి, నారువంద, బొడ్డులూరు. ఈ గ్రామముల్లో షుమారు 50,000 ప్రజలు తినుటకు తిండిలేకపడుఅవస్థలు వర్ణనాతీతములైయున్నవి. ప్రజలకన్నంలేక- దొంకల్లోను, తుప్పల్లోను మొలచే ఉలిమిడి, ఆల్లి, ముసివింటి మొదలగుపండ్లను, సీమపెండలము, నల్లేర్లను, మునగాకు మొదలగు ఆకులను ఉడకబెట్టి తింటూ- గుంటలు పోయిన కండ్లతో- చింపిరిజుత్తుతో- కంకాళమూర్తులై- ఆకటిబాధకు తాళలేక చనిపోవుచున్నారు. వీరిలో చాలామంది బర్మానుండి తిరిగి వచ్చిన కాందిశీకులు. కాబట్టి ప్రభుత్వంవారు, యేమాత్రం అశ్రద్ధవహించక, కాందిశీకుల సంరక్షణ భారాన్ని వహించాలి. మరియూ- యీ ఉద్దానముకో కపవు రోడ్లను వేయు కార్యానికి పూనుకొని- యిచ్చటి ప్రజలకు తగిన జీవితాధారాములను కల్గిచవలసియున్నది.

బర్మా కాందిశీకుల యిబ్బందులు

బారువయందలి బర్మా కాందిశీక రక్షణకమిటీకి కార్యదర్శి అయిన శ్రీ కె. నరసయ్యగారు యిలా వ్రాస్తున్నారు :—

విశాఖపట్నంజిల్లా సోంపేట తాలూకాలో సుమారు 8 వేలమంది బర్మా కాందిశీకులు ఉన్నారు. వీరిలో ఏకొద్దిమంది మాత్రమో కరువుపనులపై పని చేయుచున్నారు. రోడ్డు పనులు చేసినవారికి ప్రస్తుతం యిచ్చుచున్న రోజువారి కూలి చాలకున్నది. వీరికి నివాసయోగ్యమగు వసతిగృహములులేవు. కంట్రోలుధరలకు ఆహారపదార్థములు దొరుకుటలేదు. స్త్రీలకు ప్రసూతి సెలవులు లేవు. ఇండియా ప్రభుత్వంవారి ధనసహాయ ప్రణాళిక సరిగా అమలుజరుపబడుటలేదు. ఒక్కసెంటు జమీందారీ భూమి ఉన్నప్పటికీ, ధనసహాయం లేదు. మొదటిపర్యాయం ధనసహాయము పొందిన కాందిశీకుడు తిరిగి దరఖాస్తు పెట్టుకుంటే, ఉద్యోగస్థులు మంజూరుచేయుటలేదు. మద్రాసు ప్రభుత్వం కాందిశీక రైతులకు విత్తనములకుగాను మంజూరుచేసిన ధనసహాయం కూడా లభించుటలేదు. ఇట్టి ఘోరపరిస్థితులనుగురించి జిల్లాకలెక్టరు విచారణ జరిపి, కాందిశీకులకు తగిన సౌకర్యములు కలిగించవలసియున్నది.

బుధవారం ప్రజాశక్తి 4-8-1943

ఆగష్టు 9: శాంతినికాపాడటం దేశభక్తులకర్తవ్యం

జపాన్ ముఠాగిండ్లు సింగపూరులో సుభాస్‌బోసును సేనానాయకుడని పేరు పెట్టి, పెద్దను చేశారు. కొంతమంది ఖైదీలను, బానిసలను పోగుజేసి, వారికి "భారత సైన్యమని" నామకరణం జేసి, అతనికి అప్పగించారు. భారతదేశంలో అరాజకం చెలరేగే అదనుజూచి, టోజో కనుసైగల ననుసరించి, దండయాత్ర సాగించాలని యీ జపాన్ ఏజెంట్లు వేచి కూచున్నారు. వీరు సింగపూరునుంచి రేడియోద్వారా విధ్వంసకచర్యలుచేయుమనీ, తాము విమానాలనుంచి దింపే పంచ మాంగదళానికి సాయపడమనీ ప్రచారం చేస్తున్నారు.

ఈ దేశంలో జపాన్ ఏజెంట్లుగా పనిజేస్తున్న ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, రంగాముఠా వగైరాలు సింగపూరు రేడియో సన్నల ననుసరించి పనిజేస్తున్నారు. అగష్టు తొమ్మిదిన జాతీయ నాయకుల అరెస్టుకు వార్షిక అనుమతి దినమనే పేరుతో దేశంలో అరాజకం వ్యాపింపజేయుడానికి, జపాన్ సేనలకు దారి శుభ్రం చేయడానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెసు కమిటీల పేరుతో రహస్యకరపత్రాలను సృష్టించి, అగష్టు 9ని అరాజకం, దోపిళ్లు వగైరా విధ్వంసక చర్యలను సాగించడానికి కృషిచేస్తున్నారు.

ఈ జపాన్ ఏజెంట్లు ఒక్కొక్క చోట ఒక్కొక్కరకమైన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తున్నారు. గాంధీవాదానికి పలుకుబడివున్న బొంబాయిరాష్ట్రం వంటిచోట్ల సత్యాగ్రహం చేయాలనీ, నాయకులను విడిపించడానికి పూనాకు యాత్రలు సాగించాలనీ చెబుతున్నారు. భగత్‌సింగ్ జన్మస్థానమైన పంజాబులో "ఇంగ్లీషువారిని హతమార్చాలని" గోడపత్రికలు అంటించారు. ఆంధ్రలో రైలుపట్టాలు, టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగెలు పీకమనీ, పెట్రోలు బంకులను, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయమనీ, నినాదమిచ్చారు.

కార్మికులలో సమ్మెలు చేయించడానికి వీరు విశ్వప్రయత్నం చేస్తున్నారు. కమ్యూనిస్టులను ప్రభుత్వానికి లొంగిపోయారని నిందించడంవల్ల రాజకీయసమ్మెలను రెచ్చగొట్టడం సాధ్యంకాదని వీరు తెలిసికొన్నారు. అందుచే ఆర్థిక కోర్కెలను తీసికొని, వాటికొరకు సమ్మెలను లేవదీయాలని కృషిచేస్తున్నారు. అధిక లాభాలకై పెనుగులాడే మిల్లు యజమానులు మిల్లులను కట్టివేయడంద్వారా (బొంబాయి మొదలైనచోట్ల) వీరికి సహాయంచేయ పూనుకున్నారు. రౌడీలను వుపయోగించి, కార్మికులను పనిలోకి వెళ్ళకుండా ఆటంకపరచాలనికూడా ప్రయత్నించుతున్నారు.

వీరే విద్యార్థులలో అఖిలభారత కాంగ్రెసు కార్యక్రమమనేపేరుతో "మూడు రోజుల సమ్మెను" ప్రోత్సహించుతున్నారు. బొంబాయిలో కాంగ్రెసు విద్యార్థులను మోసపుచ్చడానికి ఒకరోజు సమ్మెకుకూడా పంచమాంగదళం దిగివచ్చింది. "శాంతియుతంగా జరగాలనే" ఊతపదాన్నికూడా వాడుతూంది.

ఐతే, పంచమాంగదళ కార్యక్రమంలో కన్పడుతున్న యీ పరస్పర వైరుధ్యాలకు కారణం ఏమిటి? ఈ వివిధమార్గాలన్నీ నేటి ప్రమాదకరమైన ఆర్థిక-రాజకీయ సంక్షోభదశలో ఒకే ఫలితాన్ని యిస్తాయి. ఉదాహరణకు చూడండి. విద్యార్థుల సమ్మె శాంతియుతంగానే ప్రారంభంకావచ్చు. కాని దాని వెంటనే నిర్బంధ విధానం, అరెస్టులు తప్పనిసరి అవుతాయనీ, అందుకు అసమ్మతిగా సమ్మెను ఎడతెగకుండా సాగించవలసిందనే నినాదంయివ్వవచ్చుననీ, పంచమాంగదళం ఎత్తు. కార్మికులలో ఆర్థిక హక్కులపేరుతో నేటి పరిస్థితులలో సమ్మెను ప్రారంభించితే నిర్బంధవిధానం, కాల్పులు వగైరా జరుగుతం, ఉత్పత్తి కుంటుపడటం, యుద్ధకృషికి నష్టం కలగడం పర్యవసానమని జపాన్‌ఏజెంట్లు ఎరుగుదురు. వారికి యింకేమి కావాలి? అదేవిధంగా నాయకులను విడిపించేనిమిత్తం పూనాకు యాత్రఅని కాంగ్రెసువాదులను మోసపుచ్చడం సులభం. కాని ఆ యాత్ర ఫలితం ఏమిటి? అరెస్టులు, నిర్బంధవిధానం, తత్ఫలితంగా తీవ్రమైన బ్రిటీషు ద్వేషాగ్ని ప్రజ్వరిల్లుతుంది. దెబ్బతిన్న దేశభక్తులలో తామేమీ చేయలేకపోయామనే కోపంతో జపాన్ అనుకూలత ఏర్పడుతుంది. ఆకలిమంటలు, అధిక ధరలతో బాధపడుతున్న ప్రజాసామాన్యం యీ అలజడిలో దోపిళ్లువగైరా అరాచకమార్గాలు పడుతారు. ఇంతకంటే జపాను ఏజెంట్లు, దేశద్రోహులు వాంఛించగలదేముంది?

గాంధీజీ లేఖల అనంతరం, దేశభక్త అనేకమంది విధ్వంసక చర్యలుకాంగ్రెసు కార్యక్రమం కాదని వాటికి దూరంగావున్నారు. ప్రజాసామాన్యం ఆ మోసంలో పడటంలేదు. అందుచే జపాన్ ఏజెంట్లు అనేక వక్రపద్ధతులతో దేశభక్తులను మోసపుచ్చి అరాచకాన్ని వ్యాపింపజేసి, జపాన్‌ను ఆహ్వానించ చూస్తున్నారు. ఈ కుట్రలోని అంతర్యాన్ని దేశభక్తులు, కాంగ్రెసువాదులు గ్రహించాలి. గాంధీజీని-కాంగ్రెసునాయకులను విడుదల చేయించడానికి, జాతీయైక్యతద్వారా జాతీయ ప్రభుత్వం స్థాపించడానికి, జపాన్ దురాక్రమణను ఎదిరించడానికి, దేశంలో శాంతిని కాపాడాలి.

దేశభక్తులందరూ ప్రజలను అకలిమంటలనుండి రక్షించడానికి కలసి పనిచేయాలి. రైతులు అధికపంటలను పండించాలి. కార్మికులు ప్రజల అవసరాలను, యుద్ధావసరాలను తీర్చడానికి ఎక్కువగా ఉత్పత్తిచేయాలి. తక్కిన ప్రజలందరూ రైతులకు, కార్మికులకు సహాయం చేయాలి. దేశభక్తులందరం యీ కర్తవ్యాన్ని నెరవేర్చితే, రాజకీయ సంక్షోభాన్ని తొలగించగలుగుతాం. జపాన్ ఏజెంటు బోసు మన మాతృదేశంలో అడుగిడటానికి అవకాశం లేకుండా చేయగల్గుతాము.

మన రాజకీయాలు

-ఐ. సి. ఎస్. ఉద్యోగుల రాజీనామా
-పార్లమెంటులో గాంధీజీ
-కలరాకు బలి

ఎటుచూచినా, బ్రిటిష్ నిరంకుశాధికార వర్గం భారతదేశ ప్రజాభిప్రాయానికీ, ప్రపంచ ప్రజాభిప్రాయానికీ, పూర్తిగా దూరమౌతూంది. ఈ మధ్య గాంధీజీ జిన్నాకు వ్రాసిన ఉత్తరాన్ని గురించి కేంద్ర శాసనసభలో చర్చించడానికే వీలులేదని నిరాకరించాడు, శాసనసభాధ్యక్షుడు. ఆ ఉత్తరంలో యేమిఉందో తెలుసుకోడానికి ఎసెంబ్లీ సభ్యుల యెదుట ఒక కాపీని సహితం ఉంచడానికి హోంమెంబరు నిరాకరించాడు. వివిధ పార్టీలమధ్య ఏకీభావం కుదిరితే తమదేమీ లేదని మాటిమాటికీ ప్రకటించుకొనే సామ్రాజ్యవాదుల నీతి ఒకఫార్సు అనే విషయం ఈవిధంగా నానాటికీ తేటతెల్లమౌతోంది.

రాజకీయ ఖైదీల స్థితిగతులు

ఇదేవిధంగా, రాజకీయ ఖైదీల విషయంలోను, డిటెన్యూల విషయంలోను, ఇండియా ప్రభుత్వం అవలంబించే వైఖరిలో తీవ్రమైన మార్పు అవసరమనీ, కేంద్రశాసనసభ సభ్యులు రాజకీయ ఖైదీలతోగాని, డిటెన్యూలతోగాని, ఇంటర్వ్యూచేసే అధికారం ఉండాలనీ, సూచిస్తూ శ్రీ టి. టి. కృష్ణమాచారిగారు ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 38 ఓట్లు వ్యతిరేకంగా 41 ఓట్లు వచ్చాయి. అంతకుముందు శ్రీ ఎన్.ఎం.జోషీ పైతీర్మానానికొక సవరణను ప్రతిపాదిస్తూ, శాసనసభసభ్యులచే ఎన్నుకొనబడు ఒక సబ్ కమిటీ సహకారంతో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయఖైదీల కేసులన్నింటినీ 'రివ్యూ' చేయాలని గావించిన సూచనకు సమాధానంగా 39 వోట్లు అనుకూలంగాను, 39 ప్రతికూలంగాను, వచ్చాయి. ఇద్దరు యూరపియన్ సభ్యులు సహితం ఆ సూచనపక్షం, తటస్థంగా ఉన్నారు. దక్షిణాఫ్రికా భారతీయుల హక్కులను నిరోధించే శాసనం ఎసెంబ్లీలో చర్చకు వచ్చినప్పుడుకూడా, ప్రతిపార్టీ సభ్యులు (యూరపియన్లు-ప్రభుత్వ సభ్యులు సహితం) దాన్ని ఖండించారు. దక్షిణాఫ్రికా భారతీయుల ఇబ్బందుల్ని తొలగించే నిమిత్తం తగిన చర్యలు తీసుకోవాలని అన్ని పార్టీలవారు ప్రభుత్వాన్ని కోరారు.

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ

ఐ.సి.యస్.ఉద్యోగుల రాజీనామా

అసలు మన దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఐ.సి.యస్. ఉద్యోగులే పట్టుగొమ్మ అను విషయం ఎల్లరికీ తెలిసిందే. అట్టి ఐ.సి.యస్.ఉద్యోగులే కొందరు నిరంకుశపద్ధతుల్ని ఏవగించుకొంటున్నారు. పంజాబుకో ఇ.వి. మూన్ అనే ఒకఆంగ్లేయ ఐ.సి.యస్. ఆఫీసరు రాజకుమారి అమృతకౌర్‌ను జైలులో అధికార్లు సరిగాచూడ్డంలేదనేవిషయం నిజమేనా అని అడుగుతూ ఒక ఉన్నతోద్యోగికి జాబు వ్రాశాడట. ఆమెను పూర్వంకంటె ఇంకా కఠినంగా చూడవలసియుంటుందని ఆ ఉన్నతోద్యోగి జవాబు వ్రాశాడట. ఈ జవాబును ఐ. సి. యస్. ఆఫీసరు అమృతకౌర్ సోదరునికి పంపించాడట. ఫలితం, తన పదవికి రాజీనామాయిచ్చి, బ్రిటన్‌కు తిరిగి వెళ్ళిపోవలసివచ్చింది! ఇలాగే క్రిందటి సంవత్సరం రిఫార్మ్సు కమీషనర్ హెచ్. వి. హాడ్సన్ అకస్మాత్తుగా ఇండియాను విడిచి వెళ్ళిపోవలసివచ్చింది. ఇండియాలో పరిపాలక వర్గం నే దవలంబించే క్రియాశూన్య విధానాన్ని విమర్శిస్తూ అతను లండన్‌లో నివసించే ఒక స్నేహితుడికి ఉత్తరం వ్రాశాడట!

పార్లమెంటులో గాంధీజీ

ఈమధ్య మళ్ళీ గాంధీజీకి-ఇండియాప్రభుత్వానికీమధ్య ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగుతున్నట్లు అమెరీమంత్రి పార్లమెంటులో అంగీకరించాడు. కాని, ఎన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయో, వాటిలో ఉన్నవిషయం ఏమిటో, ఇండియాలోగాని-బ్రిటన్‌లోగాని ఎవరికీ తెలియకూడదని అమెరీ ప్రకటించాడు. వీటిలో శత్రువుకు సహాయం చేసే ప్రచారం ఏమైనాఉంటే, దాన్ని ప్రపంచం ఎదుటపెట్టి, సులభంగా గాంధీజీని బట్టబయలు చేయవచ్చు. లేదా, ఫాసిస్టు ప్రతికూలభావాలే ఉంటే, ఆలేఖల్ని ఇంతగోప్యంగా దాచిపెట్టడం అనవసరం. క్రిందటిసారి గాంధీజీ వ్రాసిన లేఖలు బ్రిటిష్ పరిపాలకవర్గంయొక్క ప్రతిష్ఠను ఏమాత్రం ఎక్కువ చేయలేదు. పైగా అదిఅనేకరెట్లు క్షీణించింది. ఇప్పుడాపొరపాటు చేయరాదని అమెరీ నిశ్చయం కాబోలు! కాని, ఇది మొదటి పొరపాటుకంటె పెద్దదనే విషయం ఇండియా కార్యదర్శికి తెలియడంలేదు. ప్రపంచ ప్రజల్ని పసిపిల్లలమాదిరిగా భావిస్తున్నాడు యీ రాజకీయవేత్త!

పార్లమెంటులో అమెరీయిచ్చిన జవాబును విమర్శిస్తూ 'మ్యాంచెస్టరు గార్డియన్' (లిబరల్) పత్రిక యిలా వ్రాసింది:- "ప్రస్తుత పరిస్థితుల్ని గురించి గాంధీజీ తన అభిప్రాయాన్ని వెల్లడించనూ కూడదు; ఆ అభిప్రాయాలేమో యీ దేశప్రజలు ఏమాత్రం తెలుసుకోవడానికి వీల్లేదు. మనంకూడా జైలులో నిర్బంధించబడియున్నాంఅన్నమాట .... భారతీయ హక్కుల్ని కాపాడే బ్రిటిషు ప్రజలకే పరిస్థితుల్ని తెలుసుకొనే అవకాశం నిరాకరించబడినప్పుడు, భారతీయులేమనుకుంటారు?"

కొత్తవైస్రాయికి విజ్ఞప్తి

కాని, బ్రిటన్‌లో ప్రజాభిప్రాయం అమెరీ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ తరపున హారీపాలిట్ కొత్త వైస్రాయి వేవెల్‌కు ఒక జాబువ్రాస్తూ, అందులో కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ సభ్యులందరినీ వెంటనే విడుదలచేసి, వివిధ రాజకీయ పార్టీలమధ్య సంప్రదింపుల కవకాశమీయవలసిందని విజ్ఞప్తిచేశాడు. ఈ అభిప్రాయం బ్రిటన్‌లోని ప్రజాతంత్ర వాదులందరి అభిప్రాయం అనీ, భారతీయులలో కూడా అత్యధిక సంఖ్యాకులు యీకోర్కెను బలపరుస్తున్నారనీ, పాలిట్ ఆజాబులో తెలియజేశాడు.

ఆహార సమస్య

రాజకీయ రంగంలో (మిగతా 7-వ పేజీ)

కామ్రేడ్‌కు, జోహారులు

కామ్రేడ్ పెంటపాటి తాతయ్య నిడదవోలులో (పశ్చిమ గోదావరి) పార్టీసభ్యుడు. 26-7-43 వ తేదీ రాత్రి క్షయవ్యాధివల్ల రాజమండ్రి శానిటోరియంలో మరణించాడు.

ఇతడు 1930 నుండి పార్టీలో సభ్యుడుగా పనిచేస్తున్నాడు. ఆర్థిక బాధతో కుములుతూ కూడ పార్టీని నిడదవోలులో, నిలబెట్టాడు. శానిటోరియంలో చికిత్సపొందుతూన్న రోజుల్లో సహితం అక్కడొక "ప్రజాశక్తి" పఠన కేంద్రాన్ని యేర్పరచాడు. మరణశయ్యపై యితర కామ్రేడ్స్‌తో అతడిలా అన్నాడు: "పార్టీని చురుకుగా అభివృద్ధిచేయండి! నాయూస్ఫిని (ఐదు ఏండ్ల కుమార్తె) మీకు అర్పించుకన్నాను."

కామ్రేడ్ తాతయ్యకు యివే జోహారులు.

★ చిన్న కథ

తవ్వేడు బియ్యం

చాగంటి సోమయాజులు

పద్దెనిమిది రూపాయల అరణాలు అనెల జీతం జారుల్లా సాహెబు పుచ్చుకొన్నాడు. జీతం అందేదాకా ఒక అవస్థ, తరవాత ఇంకో అవస్థ. అతణ్ణి బియ్యపు నూకలకి తిన్నగా చాలదు. ఇంట్లో ఎవరికీ బట్టలులేవు. నిజమే. గుడిసెలో దీపానికే దిక్కులేదు. ఇంకెన్నింటికో దిక్కులేదు. పెళ్ళానికీ అప్పచెల్లెలికీ గాగరాలు, వల్లెవాట్లూ ఎలా వస్తాయి.

జారుల్లా బట్టలషాపులో గుమస్తా. ముప్పై రోజులూ పనిలోకి వెళితే అతని నెలజీతం యిరవై ఆరు రూపాయల పావలా, రోజుకి పద్నాలుగణాలు. ఒక్కరోజు పనిమానితే ఆ రోజు పద్నాలుగణాలూ విరిగిపోతాయి. అది వారమయ్యేది మొహరం పండుగయ్యేది పనిలోకి వెళితేనే పద్నాలుగణాలు. రెక్కాడుతున్నంతకాలం డొక్కాడుతుంది. రోగంవస్తే సంసారం రోడ్డెక్కవలసిందే.

జారుల్లా గుడిసె చేసుకొనే సరికి పదిగంటలయిపోయింది. తడకల తలుపు ముట్లవిప్పి పెళ్ళాం తీసింది. దీపంలేదు. గుడిసెలో అంతా చాకలి యింట్లో కుళ్ళుగుడ్డమూటల్లా చుట్టపెట్టుకొని పడుకొన్నారు. ఎవరికీ తిన్నలేవు. పక్కగుడిసెల్లో గింజలు బదులుపుట్టవు. తల్లీ, పెళ్ళాం, పెళ్ళికాని చెల్లెలూ, వయస్సు మీదికొస్తున్న కూతురూ ఆమె తరవాత పుట్టిన నలుగురు పిల్లలూ, గుడిసెనిండి పస్తుపడుకొన్నారు. పిల్లలు ఎవరూ తిండికోసం మారాం పెట్టలేదు. వాళ్ళందరికీ పస్తులు పడుకోడం అలవాటయిపోయింది.

"జీతమిచ్చారా" అడిగింది పెళ్ళాం

"ఇచ్చారు" అన్నాడు జారుల్లా

"ఎంతనాయనా" అందితల్లి

"పద్దెనిమిదీ అరణాలు"

"అంతే"

"ఈనెల తొమ్మిదిరోజులు పనిలోకెళ్ళలేదు."

"అల్లాహో అక్బర్" అన్నదితల్లి.

ప్రొద్దున్నే జారుల్లా బజారుకెళ్ళాడు. రూపాయిబియ్యానికెక్కువ ఎక్కడా ఇవ్వటంలేదు. ఎక్కువకావలస్తే మేజస్ట్రేటుగారి దగ్గర పెర్మిట్ తెచ్చుకోవాలి. రూపాయి దుకాణాల దగ్గర వందలజనం దొమ్ములాడుకుంటున్నారు. ఆడవాళ్ళు నలిగిపోతున్నారు. గాజులు బద్దలైపోతున్నాయి. పూట పదిగాపులు పడితే రూపాయి బియ్యం దొరుకుతాయి. జారుల్లాకి రెండురోజులకిచాలవు. జారుల్లా అందుచేత మేజస్ట్రేటు కోర్టుకెళ్ళాడు. అరబస్తాబియ్యానికి అర్జీ పెట్టుకున్నాడు.

"ఏంపనిచేస్తున్నావు?" అని అడిగేరు మేజస్ట్రేటుగారు.

"బట్టలషాపులో గుమాస్తాని" అని చెప్పుకున్నాడు.

"నువ్వు 'కోటా'బియ్యం కొనుక్కో" అని చెప్పారు. నబువుగానే చెప్పారు.

కోర్టులో జారుల్లాకి తెలిసిన కోమటి కనబడ్డాడు.

"బస్తాకి ముప్పైరెండు రూపాయలు ఇస్తే నీకు కావలసిన బియ్యం నేనిప్పిస్తాను"అన్నాడు కోమటి. అప్పటికి బస్తాఖరీదు రు. 27-12-0.

"ఇచ్చుకొంటాను" అన్నాడు జారుల్లా. ఇద్దరూ బజారుకి వెళ్లేరు. దొంగకొట్టుకెళ్లేరు. అది దొంగకొట్టు కాదు. పట్టిగ్గా ప్రజలను ఈమాదిరిగా దోపిడీచేస్తున్న లక్షాధికారి కొట్టు, బోలెడంత రాబడి పన్నూ, యుద్ధ విరాళం ఇస్తున్న లక్షాధికారి కొట్టు.

జారుల్లా బియ్యం అరబస్తా పట్టించుకెళ్లేడు. అపూట ఉద్యోగంలేదు. ఏడిశాడు కష్టం, వంట అయ్యేవరకూ కష్టసుఖాలు చెప్పుకొంటూ ఏడ్చుకొన్నాడు. పద్దెనిమిదిరూపాయల జీతానికి పదహారు బియ్యానికి అయిపోయాయి. అవేనా యిరవై రోజులు రావు. తరవాత దినం వెళ్ళడం ఎలాగ.

గుడిసెముందు కుళ్ళునీటి గుమ్మిలో బచ్చలిపాదు బలంగా పెరిగింది. అదే వాళ్ళని రక్షిస్తున్నది. బచ్చలాకు పులుసుతో ముద్దదిగుతున్నది. జారుల్లా ఆపాదునెత్తి పెణక మీదికి కట్టేడు.

ఇంట్లో పెద్దకూతురు యుక్తవయస్కురాలవుతున్నది. తిండిబలంలేక తోటకూరకాడలా గుంది. చెల్లెలికి పాతికేళ్ళు నిండుతున్నాయి. ఇంకా అవివాహిత!

జారుల్లా తన తిండి సగానికి తగ్గించుకొన్నాడు. పెద్దవాళ్ళంతా సగానికి తగ్గించుకొన్నారు. అతను గుడిసెలో పడుకోడం మానేశాడు. అప్పటికే ఐదుగురు సంతానం. అతని బుర్రని చలిచీమలలాగ బాధలుపట్టుకొన్నాయి. వీధి దిమ్మమీద చుట్టుకొని చీకపట్టిన కుక్కలాగ పడుకొంటున్నాడు.

జారుల్లా షాపుపనిమీద పైగ్రామాలు వెళ్ళి పదిరోజులకి తిరిగివచ్చాడు. తల్లి మూలుగుతున్నది. జ్వరం పెన్నున కాస్తున్నది. ఆ సాయంకాలం జారుల్లా కొట్టుమీద ఉండగా అతని తల్లి స్పృహతప్పి పడిపోయిందని కబురొచ్చింది. ఆటోటోమని పరిగెట్టాడు, తల్లి కొనప్రాణంతో గింజుకొంటున్నది.

అప్పుడు పెళ్ళాం, చెల్లెలూ చెప్పారు. జారుల్లా విన్నాడు, కళ్ళబడిని నీళ్ళు కార్చుకొంటూవిన్నాడు. అతనితల్లి కొడుకు ఊరికెళ్ళినదగ్గరనుంచీ తిండి మానేసింది. అంతకి ముందైనా చాలాకాలమై తిన్నగా తినక కడుపు కాల్చుకొంటున్నది. కోడలూ, కూతురూ ఎంత బతిమాలినా వొంట్లో బాగులేదని తిన్నగాక తిన్నని తిండిమానుకొంది. కోరి చావొంటిమీదకి తెచ్చుకొంది. స్పృహతప్పి పడిపోయింది.

పక్కమున్న కాపువనిషి ఏదో వైద్యం చెప్పింది. కానీ ముసిలిది నోరు విప్పలేదు. రాత్రి ప్రాణాలు వొదిలిపెట్టింది.

ఆమె చచ్చిపోగానే తోటి ముసల్మానులు సహాయపడి శవాన్ని భూస్థాపితంచేశారు. కబరీస్థానంకగ్గర గుమాస్తా జారుల్లాని ఆమె ఏం జబ్బుతో చచ్చిపోయిందని అడిగేడు.

"జ్వరం" అని చెప్పాడు.

"ఏంజ్వరం?"

"అదేమో"

"మలేరియా?"

"ఏమో"

"మలేరియా అని రాస్తాను"

"ఎందుకూ?"

"ఏదో రాయాలి"

"ఐతేరాయి"

తల్లి ఎందుకు చచ్చిపోయిందో జారుల్లాకి తెలుసు. తనలోతాను కృశించుకొని ఏడవటం ఎందుకనా? కారణం పైకి చెబితే పరువు పోతుంది. మోసాకోసం చుట్టూ తడకలుకట్టిన ఆగుడిసెలోఉన్న అందరికీ ఆమె ఎందుకు చచ్చిపోయిందో తెలుసు. ఆమె తిండిమాని చచ్చిపోయింది. ఒకనోరు తగ్గినా తగ్గడమే అని చచ్చిపోయింది. ఆమె తవ్వెడు బియ్యం నలుగురు పిల్లలకిచాలు. తవ్వెడు బియ్యానికి తల్లి ప్రాణత్యాగం చేసింది.

పుస్తక పరిచయం

జ్వాల (గీతాలు)

రచయిత: కోగంటి గోపాలకృష్ణయ్య.
ప్రచురణ: భారతకమ్యూనిస్టుపార్టీ కృష్ణాజిల్లా కమిటీ.

ఫాసిస్టు వ్యతిరేకత, దేశభక్తి, ఆకలి, స్త్రీ స్వాతంత్ర్యం, జైళ్ళలోని దేశభక్తులు- ఇవీ ఈ చిన్న పుస్తకంలోని ముఖ్య శీర్షికలు.

కొన్ని సినిమా రికార్డుల పక్కిలోను, కొన్ని 'కోరస్' (సమిష్టిగానాలను,) కొన్ని బిచ్చగాళ్లు, గొల్లలు, పడవవాళ్ళు, పాడే-ఆడే, రకాలలోను, ఈ గీతాలు వ్రాశారు.

ఇందులో బాగున్నవీ, ఓకిమోస్తరగా ఉన్నవీ చూద్దాం. "గెరిల్లా" అనేపాట చాలా బాగుంది. ఇది బెంగాల్‌లో వ్యాప్తిలోనున్న పాటకు అనుకరణ. ఎప్పుడూ ఈ పాట పాడుతుండగా చూడనివారికి దాని నడక సులభంగా బోధపడదు. కాని, వివిధ జిల్లాలలో ప్రచారం చేస్తున్నందువల్ల, మున్ముందీ సమస్య రాదు. "పతాక పిలుపు" కూడా "కోరస్"కు (సమిష్టి గానానికి) బాగానే వుంది. పాటలోనివిషయం పర్వాలేదు. "యువకశాంతి" కూడా సమిష్టి గానానికి పనికివస్తుంది. 'కరువు' అనే పాట రాయలసీమ పరిస్థితిని తెలియజేస్తూ ప్రబోధానికి పనికివస్తుంది. ఎక్కువ విశేషంలేకపోయినా, అతి సామాన్యంగావుంది. పాడుకోటానికి అర్థంతర్థమూ లేకుండా వుండేపాటలు: "బానిసవిముక్తి," "స్త్రీలా" "స్వాతంత్ర్యదీక్ష" "బారావ హిట్లరా" "స్టాలిన్ సారధ్యము" అనేవి.

అర్థంలేని పదాలతో, ఒక పంక్తికి మరో పంక్తికి సమన్వయంలేని పంక్తులతోను, మాటలతో డ్రిల్లుచేసేవీ, ఇందులో చాలా వున్నాయి. "జ్వాల"లో "గీతాజ్వాల, కిరణజ్వాల" అంటూ అయోమయంగా వాడాడు. "ఆకలిబాధ" లో వాడినపదాల కర్థంచెప్పానికి మా తరంగాదు. "మలమల తళ్ళిబెళ్ళ", "నకనకలబ్బబ్బు," "రగడరగడగ ఉండెరా" అన్నవాటి కర్థం శూన్యం. జయభేరిలో కొత్తవిశేషం లేకపోగా మాటలతో డ్రిల్లుచేశాడు.

"అరకఉన్న అందరిబాట
అరనిదో సంతసబాట
సాగదు ఎవరాట
స్వతంత్రమేనీబాట అహహహా"

అంటూ 'ట'ల కోసం చాల అవస్థపడ్డాడు.

వినోదకరమైన వేషాలతో ప్రచారం చేయాలని ఉద్దేశించిన పాటలు: పడవపాట, భారతాంబ సంబరం, బిచ్చగాడు, మొదలైనవి. పడవపాట సామాన్యంగా ఉంది. వచనం బాగాలేదు. భారతాంబ సంబరంలో "కుంకుమను ఎర్రగాచేత్తామండి" మొదలైన భాగం అంతా వృత్తచెత్త "బిచ్చగాడు", అనే పాటలో, అడుక్కుతింటంలోనుంచి, జపాన్‌పై సూతడంలోకి ఒక్కగంతువేశాడు.

వినోదవేషాలు ప్రజలను ఆకర్షించవచ్చు కాని, వాటికి ఒక అర్థముండాలి. రాయలసీమ కరువు పాటను, బిచ్చగాండ్రచే పాడిస్తే దాని కొక ప్రయోజనం కనపడుతుంది. అంతేగాని ప్రతిదానికి బిచ్చగాళ్ళ (రకరకాల) వేషాలు వేయడం కల్చర్ అనిపించుకోదు. మనరచనలన్నీ ప్రజలను కదల్చి ఉత్తేజపరచి, కార్యరంగంలోకి దూకించేటట్లు ఉండాలి. కాని సాధారణంగా, బిచ్చగాళ్ళు హిందూ జీవకారుణ్య అభిప్రాయాలను రేకెత్తించి భిక్షం సంపాదించుతారు. అందుచే జపానుపై ద్వేషాగ్ని రక్కించడానికి ఈవేషాలుచాలవు. వేషాలు వేయడంలో నేర్పుంచూచి 'హాహా' అనవచ్చు. కాని తాము ఉత్త ప్రేక్షకులమేగాక కార్యరంగంలోదూకి పనిచేయాలి అన్న భావన ఆపాటలు వేషాలు రేకెత్తించాలి. అందుచే ఆలాంటి పాటలకు, ఇలాంటి బిచ్చపు రూపాలను ఇవ్వటం తగ్గించి, వ్యవసాయ జీవితంలో వ్యాప్తిచెందియున్న జనపదరూపాలను, మన ప్రాచీన వైజ్ఞానిక రూపాలయిన, బుర్రకథ మొదలైనవాటిని తీసుకోవాలి. ఈ దృష్టితో చూచితే, పైన చెప్పిన పడవపాట మొదలైనవికూడా ఏమీ బాగాలేదు.

చెప్పదలచిం దేదో స్పష్టంగా చెప్పలేకపోవడం,ఒకచరణానికీ మరోచరణానికీ సంబంధం లేకుండడమూ కొన్నిచోట్ల ఉన్నాయి. ఉదా: "గమ్యస్థానం" అనుదానిలో "మాతృదేశంబునో మనరా, పరదేశముకుపోతే బాధాకరమురా" అనునది అప్రస్తుతం.

ఇకరాజకీయంగా తప్పులను(డీవియేషన్లను) చూదాం. కొన్నిచోట్ల "ధనికుల దగ్గమొనరించాలి" అనీ, కమ్యూనిజమే గమ్యంఅనీ వ్రాస్తున్నాడు. ఈనాడు మనగమ్యస్థానం ఫాసిజాన్ని ఓడించుటతో స్వాతంత్ర్యం సంపాదించడం. అందుకు ధనికులతోకూడ ఐక్యంగావలసిందే. ఈసంగతి మరచిపోయి సెక్టేరియన్‌గావ్రాస్తూ, "ఐకమత్యం ఐకమత్యం" అని చిలకపలుకులు పల్కుతున్నాడు. సమస్త ప్రజలను, ఫాసిజానికి వ్యతిరేకంగా సమీకరించుటకోసే, వర్గపోరాటం మరోరూపం దాల్చుతుందని ఇతడు మరచిపోతున్నాడు. ఇంకా సామ్రాజ్యవాదం మీద తిట్లు. ఈనాడు సామ్రాజ్యవాదం అంటే అసంతృప్తిలేనివారు లేరు. వాళ్ళని తిట్టడంవల్ల మనం చేసే ఘనకార్యంలేదు. వాళ్ళమీద అసంతృప్తితో, నిస్పృహచెంది, కార్యాచరణకు పూనుకోని ప్రజలను ఉత్తేజపరచాలి, ఆలాగే "స్వేచ్ఛాజీవి" అనే పాటలో చివరిభాగం అప్రస్తుతం, ఒకప్రక్క జపానునుతిడుతూ, మరో ప్రక్క ప్రభుత్వపై దుమ్మెత్తితే మిగిలేది చివరిదేగాని మొదటిదికాదు. అంటే ప్రభుత్వాన్ని విమర్శించడం పనికిరాదనికాదు. మనం చెప్పదలచినదాని ఉద్దేశ్యం మరచిపోకూడదు. ఈనాటి నిస్పృహాపస్థనుండి, జాతిని మేల్కొల్పి, సామ్రాజ్యవాద ప్రతిబంధకాలను సైతం దాటి, ఫాసిజాన్ని ఓడించేటట్లు చేయడమే రచయిత ఆదర్శమై ఉండాలి.

"కడుపుమంట," లోస్పష్టంగా మన కర్తవ్యాన్ని చెప్పలేదు. "తుంటరులను మంటగలిపి, ఇంటసరుకు గెంటగా" అనునది అరాజకానికి దారితీస్తుంది, కాని ఆహార సమస్యా పరిష్కారాన్ని సూచించదు.

"నాజీల గప్పాలు," రచయిత మంచి ఉద్దేశంతో వ్రాసినా, అది శత్రువులకే ఎక్కువ ఉపయోగించుకుంది. అది పాడుతుంటే, "గప్పాలు" అనే శీర్షిక వచ్చి అడ్డుపడదు. ఇలాగే "జర్మన్, జపాన్, ఇటలీ జయభేరి కొట్టిరాగ" అని, జయభేరి అర్థం తెలియకుండా వాడాడు. ఆవిధంగా ప్రతికక్షులకే ప్రచారం చేసిపెట్టాడు. హిట్లరును"కాట్లకుక్క" అని ఒకసారి వ్రాశాడు. మరోచోట జపానును "కాట్లకుక్క" లాగా కరవాలటాడు. ఇవి క్షమింపరాని దోషాలు.

సినిమారికార్డులను అనుసరించేటప్పుడు, ఒక విషయం జ్ఞాపకం వుంచుకోవాలి. "సికందర్"లోని కోరస్ ననుసరించి "కత్తిదూసి దూకుదాం" అని ముక్కాముల వ్రాస్తే అర్థవంతంగానేవుంది. కాని, "పూలోపూలో, కిస్‌లియెకల్‌కిబాత్" లాంటి వరుసలతో ఫాసిస్టులపై ద్వేషాగ్నిని ప్రబోధించబోతే అపహాస్యానికి పాలవుతాం.

ఇన్ని దోషాలతోను, రాజకీయ డీవియేషన్ల (తప్పుల)తోను నిండిన ఈ గ్రంథం, కృష్ణాజిల్లా కమిటీ పేరిట ప్రకటించబడటం క్షంతవ్యం కానిది. ఇకనైనా దీనిని ప్రచారంలో నుంచి తీసివేయాలి.

ఆదర్శప్రాయమైన కూలీ - రైతు సామరస్యం

భట్లపెనుమర్రు (కృష్ణాజిల్లా) గ్రామంలో కూలీలకు, రైతులకు మధ్య ఊడ్పుల రోజులలో జరిగిన ఒడంబడిక ప్రకారం కూలీలు రోజుకు 8 గంటలచొప్పున పనిజేస్తూ, పురుషులు 9 తవ్వలు (శేర్లు) స్త్రీ 7 తవ్వలు చొ॥ ధాన్యం తీసుకొంటున్నారు. ఊడ్పులలో ఏర్పడిన ఈకూలీ - రైతుసామరస్యం కణుపు రోజుల్లోను, తరువాతనుగూడా స్థిరంగా ఉండునట్లు అచ్చటి కామ్రేడ్సు కృషిచేసి జయం పొందారు. రైతులు ఊడ్పుల్లో యిచ్చినకూలీ రేటే సంవత్సరం పొడుగునా యిచ్చుటకు అంగీకరించారు. పెద్ద రైతులలో కొందరు ముందుగా అంగీకరించక, రైతు - కూలీ సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించినా విఫలులయ్యారు. చివరకు చేసేదిలేక వారుగూడా అంగీకరించి, పై రేటును కలుపురోజులలో కూడా యిస్తున్నారు. భట్లపెనుమర్రులో యేర్పడ్డ కూలీరైతు సామరస్యం మూలాన చుట్టుప్రక్కల గ్రామాల కూలీలలోగూడ ఐక్యతవచ్చింది. వారుగూడా భట్లపెనుమర్రు కూలీలు తీసుకున్న రేటునే కలుపుల్లోను, యికముందుకూడా ఈయమని ఆయాప్రాంతాల రైతులను అడుగుచున్నారు. భట్లపెనుమర్రు రైతులు చుట్టుప్రక్కలనుండి తీసుకొచ్చే కూలీలకు తమ గ్రామకూలీలకిచ్చే రేటునే యిచ్చుటకు అంగీకరించి పనిచేయించుకుంటున్నారు.

భట్లపెనుమర్రు కామ్రేడ్సు కూలీరేట్ల విషయమేగాక, వ్యవసాయ కూలీలకు కరువు రోజులలో (అక్టోబరు, నవంబరు మాసాల్లో) అప్పులు యిప్పించడానికిగాను 6 పుట్ల ధాన్యం పోగుచేసి, వేరే పురి కట్టించారు. ఇంకా హెచ్చుమొత్తాన్ని యిదివరకుయివ్వని రైతుల నుండి వసూలుచేయడానికి కృషి జేస్తున్నారు. ఆహారకమిటీని యేర్పరచి రైతులను, కూలీలను ఒక్కరు దిగబడకుండా దానివెనుక ఐక్యపర్చగలిగితే యింతవరకుయేర్పడ్డ కూలీరైతు సామరస్యం బాగా స్థిరపడిపోతుంది: ఆదర్శప్రాయంగా వుంటుంది. భట్లపెనుమర్రు కామ్రేడ్సు తాము సాధించిన విజయాలను యింకా వున్నతస్థాయికి గొంపోవాలి.

ఐకమత్యంవల్ల కలిగినలాభాలు

నిడుమోలు (దివితాలూకా)లో ఇద్దరు రైతుల తగాదాను పరిష్కరించుటద్వారా, రైతునాయకులు ఆగ్రామంలో మంచి ఐక్యత ఏర్పరిచారు. అనాటినుండి రైతుసంఘం తరపున ఒక కమిటీ ఎన్నుకోబడింది. ఆకమిటీ ఈ క్రింది పనులను సాధించింది. (1) నాల్గేండ్లనుండి పాడుపడిన మూడు చెరువులను మరమ్మతు చేసుకున్నారు. (2) ఇండ్ల సరిహద్దుల వద్ద, పొలంకాడి గట్టులవద్ద వచ్చిన 10 తగాదాలను కమిటీ తీర్చి రాజీచేసింది. (3) ఇంటి ప్రక్క గొయ్యితీయడంవల్ల ఒకయిల్లు పడిపోతే, ఆఇంటి యజమానికి, నష్టపరిహారం, కోర్టుకు వెళ్ళకుండానే ఇప్పించింది. (4) రెండు దెబ్బలాట కేసులలో, అన్యాయంగా ప్రవర్తించినవారికి శిక్షవేసి, ఉభయపార్టీలు తృప్తిపడునట్లు పరిష్కరించింది. (5) 900 రూపాయల విలువగల ఎరువు పిండిని, ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, రైతులకిప్పించింది. ఇలాంటి ఐక్యత అన్నిగ్రామాలలోను ఏర్పరుచుకొని, స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలి.

★

కృష్ణానది వరదలవల్ల రైతుల - కూలీల అగచాట్లు

కృష్ణానది వరదలవల్ల, కృష్ణా, గుంటూరు జిల్లాలలో విపరీత నష్టం కలిగింది. ఇదివరకే తిండిలేక, పనిలేక, పశువులకు మేతలేక, అంటువ్యాధులతో బాధపడుతుంటే సత్తెనపల్లి తాలూకాలోని అచ్చన్నపేట, బెల్లంకొండ ఫిర్కాలకు వరదలు వచ్చిపడ్డాయి. వీటితోపాటు పెదకూరపాడు ఫిర్కాకూడ వరదల పాలయింది. సత్తెనపల్లి తాలూకా రైతు సంఘం, యువజన సంఘ కార్యదర్శులు పరిస్థితులను తహసీలుదారుకు తెలియజేశారు. మూడు దళాలుగా బయలుదేరి నష్ట వివరాలు తెలుసుకొంటున్నారు. విత్తనాల నష్టం 2 లక్షల రూపాయలూ, పంట, ఆస్తినష్టం 3 లక్షల రూపాయలుంటుందనీ అంచనావేస్తున్నారు. వావిలాల గోపాలకృష్ణయ్యగారు, ప్రభుత్వం ఈ క్రింది కర్తవ్యాలను చేయాలంటూ హెచ్చరిస్తున్నారు. (1) నష్టపడిన విత్తనాల ఖరీదు ముజరా ఈయాలి. (2) పైరువేయ వీలులేని పొలాలకు రిమీషన్ ఈయాలి. (3) విత్తనాలు నష్టయి చేయాలి. (4) తక్కావీ అప్పులు, వ్యవసాయాభివృద్ధి అప్పులు ఈయాలి. (5) నష్టపడ్డ ఇండ్లకు తాటాకులు సప్లయిచేయాలి. (6) వెంటనే తిండిసహాయం చేయాలి.

గుంటూరుతాలూకాలోకూడ ఇట్టిపరిస్థితులే ఉన్నట్లు, తాలూకా రైతుసంఘ అధ్యక్షులు, అర్గనైజరు జులై 19 వ తేదీనాటికి పరిస్థితులను ఇలా తెలియజేస్తున్నారు: గుంటూరు తాలూకాలో 25 గ్రామాలు నష్టపడ్డవి. 20 గ్రామాలకు ఇతర ప్రపంచంతో సంబంధం లేకుండాపోయింది. నల్లగ్రామాలనుమాత్రమే మేము పడవలలో వెళ్ళి సందర్శించగల్గాము. 100 కి 25 ఇండ్లు పనికిరాకుండా పోయాయి. ప్రజలకు తిండిలేదు. పశువులకు మేతలేదు. ఏరోజుకారోజు కూలి తెచ్చుకునే కూలీల స్థితి మరీఅవస్థగా వుంది ప్రక్కగ్రామాలకు వెళ్ళి ఆహారం తెచ్చుకోడానికి పడవల సప్లయిలేదు. ఇదివరకే గ్రామాలలో మలేరియావ్యాధి ఉంది. వేరుశనగ విత్తనాల నష్టం 2 లక్షల రూపాయలూ, వేరుశనగ మహసూలు పైరు నష్టం 20 లక్షల రూపాయలు వుంటుందని అంచనా వేస్తున్నారు.

కృష్ణాజిల్లా దివి ఐలండులో మూడువేల గొర్రెలూ, వెయ్యి పశువులూ నష్టపడినట్లు తెలుస్తుంది. శ్రీకాకుళం పరిసరలంకభూములు 14 వేల ఎకరాల మెట్ట, తోటపొలాలు దెబ్బ తిన్నవి. పంట నష్టం 8 లక్షలరూపాయలనీ, పశువులు, గొర్రెలు విపరీతంగా చనిపోయాయనీ తెలుస్తుంది.

గన్నవరం తాలూకా రైతుసంఘం తరపున ఒక ఉపసంఘం, కృష్ణానది వరదలవల్ల గన్నవరం తాలూకాలో నష్టపడిన లంకపల్లి, అప్పారావుపేట, కనిగిరిలంక, అయిలూరులంక, ములకలపల్లి లంకలలో పర్యటనం చేశారు. నష్టాల వివరాల నిలా తెలియజేస్తున్నారు. "మొక్కజొన్న 20 ఎరాలకు 20 వేల రూపాయలు. మువ్వులు 26 ఎకరాలకు రెండువేలు. కొర్రలు 6 ఎకరాలకు మూడువందల అరవై. కందులు వంద ఎకరాలకు 7750, నీలి ఆకు 120 ఎకరాలకు 2400, పచ్చిగడ్డి 2065 ఎకరాలకు 51½ వేలు. రూపాయల నష్టమైంది. ఇంతేగాక, 50 ఎకరాలు నదిలో కలిసిపోయింది. 200 బళ్ళ ఎండుగడ్డి పాడయింది. పుగాకు మోపులు చాలా నష్టం అయాయి. ప్రభుత్వం వెంటనే ఈపనులకు పూనుకోవాలి. 1. జమీందార్లద్వారా శిస్తు రెమిషన్ యిప్పించాలి. 2. జమీందారీ లంకలలో గడ్డి ఉచితంగా మేపుకోనీయాలి. 3. నష్టపడిన పైరుల మీదనే ఆధారపడ్డ రైతుకుటుంబాలకు ధాన్యం సప్లయి చేయించాలి."

ఇటలీలో ఫాసిస్టు ప్రతికూల ఉద్యమం

ముస్సోలినీ పదభ్రష్టుడయ్యాడు. కాని, ఇంతకుపూర్వమే, ఇట్టి పరిస్థితికి దారితీసే అశాంతి ప్రబలివుంది. గుడ్డిగా హిట్లరుకు తొత్తులై అంటిపెట్టుకొన్న ఇటాలియన్ సైన్యాలు సోవియట్ యూనియన్‌లో విపరీత నష్టాలకు గురిఅయాయి. ఆఫ్రికాలో వాటినన్నీ కన్నులొట్టబోయింది. దీనఫలితంగా భయమూ గందరగోళమూ వ్యాపించింది. ఎవరో కొందరి మీద పాపమంతా రుద్దితే, ప్రజలను మోసగించవచ్చునని, ఈసంవత్సరం ప్రారంభంలో ముస్సోలినీ 15 మంది మంత్రుల్ని, ఉపమంత్రుల్ని ఊడబెరికాడు. ఇందులో తన అల్లుడూ, విదేశాంగమంత్రీ అయిన కియానో కూడ ఉన్నాడు. న్యాయశాఖమంత్రి కౌంట్ గ్రాండీ కూడా ఉన్నాడు.

వీళ్ళందరికన్నా ముందే, ఇటలీ సర్వసైన్యాధ్యక్షుడు హ్యూగోకావల్లెరో ను ఊడబెరికాడు.

ఇవన్నీ ఏమి తెలియజేస్తున్నాయి: సైన్యాధ్యక్షుని ఊడబెరకడం—మిలటరీ అసమర్థతను అంగీకరించడం. విదేశాంగమంత్రిని రద్దుచేయడం విదేశరాజనీతి విఫలతను తెలియజేస్తుంది. కాని తలలు మారినంత మాత్రాన, ఇటలీ దుస్థితి బాగుపడుతుందా? హిట్లరు, బ్రౌకిష్‌ను తొలగించి సర్వసైన్యాధిపత్యం వహించినంత మాత్రాన, ఏమన్నా ఘనకార్యం చేయగలిగాడా? ఈమార్పులు, ఎత్తులపై యెత్తులు, ప్రజల కోర్కెగ్నినుండి తప్పించలేదు.

జూన్‌లో ఇటాలియన్ నౌకాదళంలో తిరుగుబాట్లు జరిగాయి. ఇవి ట్యూనిస్‌లో అపజయఫలితమే. రోజురోజుకూ బాంబులవర్షం కురిసిన కొలదీ, ఫాసిస్టు ప్రతికూలభావాలు హెచ్చుసాగాయి. గత 20 ఏండ్ల మొత్తం కంటె 1942 లో జరిగిన విధ్వంస కార్యాలు హెచ్చు.

కార్మికులకు కేంద్రమై, ఈనాడు అశాంతి ప్రజ్వరిల్లియుండిన మిలాన్‌లో, గత మాసాలలో 455 మంది విధ్వంసకచర్యలు గావించినందుకు అరెస్టైయారు. గనుల ప్రదేశాలలో (ఇడ్రాన్) గెరిల్లాలు బాగా పనిచేస్తున్నారు. వెనీషియాప్రాంతంలో స్లావ్ గెరిల్లాలతో కలిసి వీరు పనిచేస్తున్నారు. గెరిల్లాలు పనిచేసేచోట ప్రజాసహకారం, ప్రజలు రక్షణ ఇవ్వడం జరుగుతోంది.

విదేశ రేడియో ప్రసంగాలు విన్నందుకు వేలకొలది అరెస్టు చేయబడుతున్నారు. 570 మంది సైనికులకు 15 మొదలు 20 ఏండ్ల శిక్షవిధించి, ఐసినారా దీవుల (దయ్యాలదీవుల) లో వుంచారు. ఇదే, ఫాసిస్టు ప్రతికూల ఉద్యమం సైన్యంలోకూడ వ్యాపించిందనడానికి నిదర్శనం మేడే నెలవు ఈయనందున, ట్యూరిన్‌లో ఒక ఫ్యాక్టరీ పనిచేయకుండా, ధ్వంసం చేయబడింది. అలాగే, మిలాన్, జినోవాలలో విధ్వంసక చర్యలు జరిగాయి.

బాంబులు పడ్డ పట్టణాలలో ముస్సోలినీని సందర్శించేదమ్ములులేక, రాజుగారినిపంపాడు. ప్రతిచోటా "శాంతికావాలి; శాంతికావాలి;" అన్న నినాదాలు. తెల్లజండాలు కనిపించాయి.

ఫాసిజంతో పోరాడనివారిలోకూడ అపజయభీతి వ్యాపించిందనడానికి, ఆఫ్రికాలో తండోపతండాలుగా ఇటాలియను సైనికులు లొంగిపోవడమే నిదర్శనం.

ఫాసిజాన్ని ప్రతిఘటించే ఉద్యమంలో, రిపబ్లికన్‌లు, సోషలిస్టులు, కాథలిక్కులు, కమ్యూనిస్టులు, సిండికలిస్టులు, వున్నారు. గతనెల 13 వ తేదీన, "ఫాసిస్టు ప్రతికూల సంయుక్త సంఘం" ఏర్పడిందంటూ ఒక వార్త వచ్చింది. అందులో కమ్యూనిస్టులు కూడా వున్నారు.

ఈనాడు ముస్సోలినీ పతనంతో, ముస్సోలినీ స్థానే బడోగ్లియో వచ్చినంతమాత్రాన బాధ్యతఅంతా తీరలేదు. అణగియున్న ప్రజాశక్తులు విజృంభించడానికి మంచి అదును వచ్చింది. మిత్రరాజ్యాలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, ఇటాలియన్ ప్రజలదాస్య విముక్తికి చేయూతనీయాలి.

బాలసంఘాల నిర్మాణం

దేశంలో బాలబాలికలు పెద్దలతోబాటు రాజకీయాలు తెలుసుకుంటూ, దేశశక్తిని పెపొందించుకుంటూ, తమసంఘాలను వృద్ధి చేసుకొంటున్నారు. ఈక్రిందిచోట్ల కొత్త బాలసంఘాలు ఏర్పడ్డాయి: ఏలూరు 20 వవార్డు; ఏలూరు 21 వ వార్డు; బండారుపల్లి (గుంటూరు తాలూకా); ఈమని (తెనాలితాలూకా); గుంతకల్లు రైల్వేకాలనీ; వెంకనపాలెం (నెల్లూరు తాలూకా); కొందోపాడు (భీమవరంతాలూకా); కొళ్ళపర్రు (భీమవరంతాలూకా); మలకాపురం (విశాఖపట్నంజిల్లా).

కర్నూలులో అరెస్టులు

గత నెల 23 వ తేదీని, కామ్రేడ్స్ వి. బావయ్య, సోమశేఖరరావుగార్లు కర్నూలుజిల్లా బొకు కరువుక్యాంపుకు వెళ్ళారు. క్యాంపులో రోజు పదకొండువందలమంది కూలీలు పనికి వస్తూవుండేవారు. వారికి రోజుకూలి ఇచ్చి పనిచేయించుతూవుండేవారు. ఆరోజు అవిధంగా కూలీ యివ్వక, పనిని కంట్రాక్టుకు ఇస్తాం కాని కూలీఇచ్చి చేయించమని ఆఫీసర్లు కూలీలతో చెప్పగా, కొందరు కూలీలు దానికి నమ్మలేక పనినుండి వెనక్కు పోవ ప్రయత్నించారు. అపుడు ఆఫీసర్లు కూలీలతో "మీరు పనిలోకి రాక వెనక్కు పోయినచో పోలీసులతో లాఠీచార్జి చేయించి బలవంతంగా పనిలో ప్రవేశపెట్టించుతామని బెదరించుచున్న సమయంలో మన కామ్రేడ్స్ వెళ్ళారు. అపుడు మన కామ్రేడ్స్ కూలీలతో "మీరు పనికి వెళ్ళండి, కూలీడబ్బులు గిట్టకపోయినట్లయితే, ఇంజనీరుకును, ఎక్జిక్యూటివ్ యింజనీరుకును మహజర్లు యిప్పించుతాము" (కూలీ డబ్బులు ఎక్కువ చేయుటకు) చెప్పినప్పటికీ కొందరు కూలీలు వినక పనినుండి వెనక్కుపోయారు. కొందరు పనిలో ప్రవేశించారు. తర్వాత "వి. బావయ్య, సోమశేఖరరావు కూలీలను పనిలోకి రానివ్వకుండా కూలీలచే సమ్మె చేయించుటకు ప్రయత్నించుచున్నారు" నే మిషతో ఈకామ్రేడ్సును అరెస్టుచేసి నంద్యాల సబ్‌జైలు రిమాండులో వుంచారు.

చౌకడిపో కమిటీలో ఆహారకమిటీకి ప్రాతినిధ్యం

బెజవాడ ఆహారకమిటీ గావించిన ఆందోళన ఫలితంగా, జులై నెల 8-7-43 న జరిగిన చౌకడిపో కమిటీ సమావేశంలో యీక్రింది నిర్ణయాలు చేయబడ్డాయి.

1. బియ్యం ధర సేరు 0-3-6 నుండి 0-3-3 కి తగ్గించారు (బజారు ధర: 0-4-3)

2. రేషన్ కార్డులు లేని బీద ప్రజలందరికీ కార్డులు యిచ్చే ఏర్పాట్లు చేయనున్నారు (ఇంతవరకు 16,000 కుటుంబాలకు మాత్రమే కార్డులిచ్చారు)

3. కార్డులు యిచ్చిన ధనిక కుటుంబాల నుండి వాటిని తిరిగి తీసుకోవాలి

4. ఉన్న 6 డిపోలలో రెండు డిపోలకు జాయింటు సూపర్వైజర్లుగా ఆహారకమిటీ అధ్యక్ష - కార్యదర్శులను నియమించారు.

5. వారిద్దరినీ చౌకడిపో కమిటీలో సభ్యులుగా కో-ఆప్టుచేసుకున్నారు.

రహస్యపుస్టాకులు పట్టుపడ్డాయి

27-7-43 వ తేదీ రాత్రి రెండు పడవల బియ్యం బెజవాడ నుండి యితర జిల్లాలకు పోతూంటే, వాలంటీర్లు వాటిని పట్టుకున్నారు. మరిరెండు పడవల ఆముదపు పిండి కూడా పట్టుబడింది. రేవులవద్ద పోలీసులనుగార్డు పెట్టుటకు, వాలంటీర్ల సహాయంకూడా తప్పక తీసుకొనుటకు, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు వాగ్దానంచేశారు. 27-7-43 నుండి పోలీసులు, ప్రజారక్షణదళ వాలంటీర్లు నిషేధించబడిన సరుకు బయటికి పోకుండా కాపలా కాస్తున్నారు.

పసంటి బిడ్డ రక్షించబడింది

21-7-43 వ తేదీ సాయంకాలం 5 గం॥ లకు బెజవాడ, లబ్బీపేటలో ఒక తాటిఆకు యింట్లో తాలింపువేస్తూంటే, నిప్పు రగిలి యిల్లు అంటుకుంది. చుట్టు ప్రక్క ప్రజలు కేకలు వేస్తూ, తమకు చేతనైన సహాయం చేస్తున్నారు. వెంటనే ప్రజారక్షణదళ సభ్యులు అక్కడికి పరుగెత్తి, మండుతూన్న యింట్లో ఒకచంటిబిడ్డ చిక్కుకొని ఉంటే, ఆబిడ్డను బయటికితీసుకొచ్చి కాపాడారు. తరువాత యింటిని పూర్తిగా ఆర్పివేశారు. ఈవిధంగా, బెజవాడ ప్రజారక్షణదళ సభ్యులు ప్రజలకు సన్నిహితసహాయం చేస్తూ, వారి విశ్వాసానికి పాత్రులౌతున్నారు.

డిపోలవద్ద వాలంటీర్ల కృషి

విశాఖపట్టణంలో కంచరవీధి వలంటీర్లు 10 మంది దాదాపు 1000 మందిప్రజలకు ఎట్టి అల్లర్లు లేకుండా రెండు డిపోలదగ్గర బియ్యం పంచుతున్నారు. స్త్రీ పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బియ్యం అందనివాళ్ళు చాల అరుదు.

ఒకనాడు పనిపాటలు చేసుకొనే కూలీలు రాత్రి 7 గంటలవరకు డిపోదగ్గర బియ్యం దొరక్క ఆరాత్రి పస్తులుండటం వాలంటీర్లు చూచారు. మరుసటి రోజున వర్తకులతో మాట్లాడి ఒప్పించి, ఆకూలీల యిళ్ళలెక్కలు తయారుచేసి, వారికి కావలసిన బియ్యం వేరే తీయించి యిప్పించారు

ఒక్కొక్కప్పుడు బియ్యం దొరకక, ఉండిపోయినవారికి మరో డిపోదగ్గరకు తీసుకొని వెళ్ళి అక్కడ యిప్పిస్తున్నారు. మొదట్లో వలంటీర్లను దూషించి నెట్టివేసిన ఒక ప్రముఖ వ్యక్తి యీమధ్య వీరు చేసే ఆదర్శకృషిని మెచ్చుకుని వలంటీర్లదగ్గరకు వచ్చి, "ఇదివరకు మిమ్ములను తూలనాడాను, క్షమించండి. మీరు ప్రజలకోసం చాల కష్టపడుతున్నారు. మీ కృషికి మేమంతా తోడ్పడుతాం" అని అన్నాడు.

ఒకరోజున వర్తకులు రహస్యంగా యితర గ్రామస్థులకు రు 13 కి 3 శేర్లచొప్పున అమ్ముతుంటే వలంటీర్లు పట్టుకున్నారు. వర్తకులు క్షమాపణ వేడుకొని, యికమీదట అలా అమ్మమన్నారు. అలా అమ్మితే మీరు విధించిన శిక్షలకు అర్హులమని ఒప్పుకున్నారు. ఈవిధంగా వలంటీర్లు ప్రజలకు సన్నిహితులౌతున్నారు.

కిరసనాయిలు పంపకం

కమ్యూనిస్టులు జూన్ నెలలో నిడదవోలు (కొవ్వూరు తాలూకా) కాల్‌టాక్స్ కిరసనాయిలు కంపెనీలో జరిగే అన్యాయాన్ని ఎదుర్కొని, నిడదవోలు శివారు లింగంపల్లి గ్రామ రైతులకు సక్రమంగా కిరసనాయిలు పోయించారు. ఆక్రోషంతో ఈసారి పూర్తిగా కిరసనాయిలు పోయకుండా యెగవేయటానికి తంటాలుపడ్డారు షాహుకారు గుమాస్తాలు. వెంటనే రెవిన్యూ ఇన్‌స్పెక్టరువద్దకు కామ్రేడ్ బుల్లిరాజు రాయబారం వెళ్లాడు. చెప్పినదంతా ఇన్‌స్పెక్టరు విని, రైతులకు కిరసనాయిలు పోయవలసినదిగా ఆర్డరిచ్చాడు.

క్రితం నెలలో ప్రతి రైతుకూ అర్ధశేరు మాత్రమే పోశారు. ఈనెలలో ప్రతి రైతుకూ శేరుచొప్పున పోయించగలిగారు.

మహిళా ఉద్యమ వ్యాప్తి

★

ఈమధ్య నాదెళ్ళవారి పాలెంలో జరిగిన కృష్ణాజిల్లా మహిళామహాసభ వృద్ధ స్త్రీలలో సహితం ఉత్తేజాన్ని కలిగించింది. స్త్రీల సమస్యల్ని పరిష్కరించడానికి కమ్యూనిస్టు యువతులిచ్చిన కార్యక్రమం, సూచనలు స్త్రీ సామాన్యంలో సంచలనం కలిగించాయి. భట్లపెనుమర్రులో గతమాసం గ్రామ మహిళా వర్కర్లు పార్టీనిధికి సొమ్ము వసూలుచేస్తూంటే 65 సంవత్సరాల వృద్ధురాలు రెండుసార్లు అయిదేసి రూపాయలిచ్చి, తానీయగలిగినది అంతేనని చెప్పింది.

పశ్చిమగోదావరిజిల్లా సత్రంపాడు గ్రామములో శ్రీమతి అన్నే రామతులశమ్మగారు ఇంటింటికివెళ్ళి, హిందూ లా సవరణబిల్లులో స్త్రీలకుకావలసిన హక్కులనుగురించి ప్రచారం చేసి, సంతకాలు తీసుకున్నారు మహిళా సంఘంలో 12 గురిని సభ్యురాండ్రుగా చేర్పించారు. ఏలూరు మ్యునిసిపల్ స్త్రీ కార్మికులలో చౌకడిపోలను గురించి, అంతవరకు కార్మికులు పొందిన విజయాలను గురించి, చెప్పి ఐక్యత యొక్క ప్రభావాన్ని వివరించారు. సభకు హాజరైన స్త్రీలందరూ మహిళా సంఘంలో చేరారు. ఏలూరు పట్టణంలోనే తూర్పువీధిలో జరిగిన స్త్రీల సమావేశం ఫలితంగా 20 మంది స్త్రీలు సంఘంలో సభ్యురాండ్రుగాచేరి, కమిటీని ఎన్నుకున్నారు. డా॥ శ్రీమతి గంగాజలమ్మగారు అధ్యక్షురాలు, కుమ్మర మాణిక్యాంబగారు కార్యదర్శిని. జాతీయనాయకుల విడుదలను గురించి, ఆహారసమస్యను గురించి, రావు కమిటీ సిఫార్సులను గురించి, తీర్మానాలు చేయబడ్డాయి. వత్తైబాద గ్రామంలో జరిగిన స్త్రీల సమావేశానికి 50 మంది హాజరయారు. మహిళాసంఘాల ఆవశ్యకతను గురించి శ్రీ అహల్యాదేవిగారు, రామతులశమ్మగారు ఉపన్యసించిన మీదట 20 మంది సభ్యురాండ్రుగా చేరారు.

కృష్ణాజిల్లా వానపాముల గ్రామంలో 9-7-43 వ తేదీని గ్రామ మహిళాసంఘం సమావేశమయింది. శ్రీమతి సరిపల్లి సుందరమ్మగారు హిందూలా సవరణబిల్లును గురించి, ఆహార సమస్యను గురించి, మాట్లాడారు. శ్రీమతి కాజ నాగమణిగారు రాయలసీమ కరువు మొదలైన సమస్యలపైఉపన్యసించారు. ఇద్దరు వృద్ధ స్త్రీలు కొత్తగాసంఘంలో చేరారు. నూతన సంవత్సరానికి శ్రీమతి శంకరాల తులశమ్మగారు అధ్యక్షురాలుగను, కాజ నాగమణిగారు కార్యదర్శినిగాను, ఎన్నుకోబడ్డారు.

15-7-43 వ తేదీని విశాఖపట్నం జిల్లా గుల్లలపాలెంలో శ్రీమతి సరోజినిగారు 200 మంది పురుషులు, 150 మంది స్త్రీలు, హాజరు అయిన బహిరంగసభలో ఆహార కమిటీవల్ల ప్రజలు పొందుతూన్న లాభాన్ని గురించి, ముందు కర్తవ్యాలను గురించి ఉపన్యసించారు. ఆహార సమస్యకూ - దేశరక్షణకూగల సంబంధాన్ని వివరించారు. గ్రామస్థులందరూ ఆహార కమిటీని బలపరుస్తాము, ప్రజారక్షణ దళంలో చేరుతామనీ, వాగ్దానంచేశారు.

25-7-43 వ తేదీని బెజవాడకు చెందిన లబ్బీపేటలో స్త్రీల సమావేశం జరిగింది. 25 గురు స్త్రీలు హాజరయారు. 60 సంవత్సరాల ఒక పేద వృద్ధురాలు ప్రతి స్త్రీ సంఘంలో చేరవలసిందని హెచ్చరించింది. వెంటనే 5 గురు కొత్తగా చేరారు. కమిటీకి శ్రీమతి అంద్రపల్లి పార్వతమ్మగారిని అధ్యక్షురాలుగను, తుమ్మల సీతారామమ్మగారిని కార్యదర్శినిగను ఎన్నుకున్నారు. లబ్బీపేటలో సుమారు 1500 మంది కార్మిక స్త్రీలు నివసిస్తున్నారు. వారికి మరుగుదొడ్డులేక ఎంతో యిబ్బంది పడుతున్నారు. పేటకూడా అనారోగ్యంగా ఉంది. అందువల్ల పబ్లిక్ లెట్రిన్ ఒకటి కట్టించవలసిందని మ్యునిసిపాలిటీని కోరుతూ తీర్మానించబడింది. ఒక ప్రసూతి వైద్యశాలకూడా కట్టించవలసిందని కోరారు.

విద్యార్థి సమస్యలు

★

గుంటూరుజిల్లా విద్యార్థి కార్యదర్శి శ్రీ గోపాలరావుగారు ఇలా వ్రాస్తున్నారు: "విద్యార్థులకు ఇప్పుడు ముఖ్యంగా రెండుచిక్కులు అడ్డుతగులుతున్నవి. వ్రాసుకోడానికి తెల్లకాగితాల, చదువుకోడానికి కిర్సనాయిల్ దొరకడం చాల కష్టంగా వున్నది. అందువల్ల జిల్లాలోని ప్రతివిద్యాసంస్థలోను విద్యార్థులందరు ఐక్యమై తమకు కావలసిన తెల్లకాగితాలు, కిరసనాయిలు సంపాదించు వరకూ నిరంతర ఆందోళనచేయవలెను. ప్రతిహైస్కూలునందు ఒక కోఆపరేటివుస్టోర్సు స్థాపించేటట్లు విద్యాలయాధికారులను అడుగవలెను.

"జిల్లాలో ఒంగోలు రేపల్లె, కొల్లూరు, తురిమెళ్ళ హైస్కూళ్ళలో విద్యార్థులు తమ హెడ్మాస్టర్లవద్దకు డిప్యుటేషన్లు వెళ్ళగా, వారు విద్యార్థులకు కావలసిన తెల్లకాగితాలు, కిరసనాయిల్ సమస్యలు తీర్చుతామని, పై అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతామని, వాగ్దానాలు చేశారు కావున జిల్లాలోని అన్ని స్కూళ్ళ విద్యార్థులుకూడా వెంటనే తెల్లకాగితపు సమస్యమీద పెద్దలను, పిన్నలను, విద్యాలయాధికారులను కూడగట్టుకుని పైఅధికారుల వద్దకు మహజర్లు, డిప్యుటేషన్లు పంపవలెను."

కిందటినెలలో జరిగిన గుంటూరుజిల్లా విద్యార్థిసంఘ వర్కింగుకమిటీ వి. గోపాలరావుగారిని ప్రధాన కార్యదర్శిగను, కె. వి. బసవయ్యగారిని - కొరటాల సత్యనారాయణ గారిని అర్గనైజర్లుగాను, ఎన్నుకొంది.

కృష్ణాజిల్లా విద్యార్థిసంఘ వర్కింగు కమిటీ జులై 18 వ తేదీని బి. వి. రావు అధ్యక్షతను సమావేశమయి యీక్రింది నిర్ణయాలు గావించినది.

రాష్ట్రంలో అనేకమంది జైళ్ళలోవున్న విద్యార్థులను ఎట్టి షరతులు లేకుండా విడుదలచేసి, వారికి చదువుకొను అవకాశము కలుగజేయవలయుననియు, ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు కొరడాదెబ్బలను ఉపయోగించుటను ఖండిస్తూ, ఆశాసనం వెంటనే రద్దుచేయవలెననియు, విద్యార్థులు పేపరు, కిరసనాయిల్ లేకుండా బాధపడుటచే, విద్యాలయాధికారులు ప్రభుత్వోద్యోగులు వెంటనే తగు శ్రద్ధ తీసికొని, విద్యార్థులకు అవి వచ్చు అవకాశము కలుగజేయవలయుననియు, రాయలసీమకు విద్యార్థులందరు విరాళములను ప్రోగుచేయవలయుననీ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి.

శ్రీ కాట్రగడ్డ వెంకటపయ్యగారు జిల్లా కార్యదర్శిగాను, వి. మధుసూదనరావుగారు, పి. ప్రకాశరావుగారు అర్గనైజర్లుగాను, ఎన్నుకోబడ్డారు.

స్పోర్ట్సు ట్రైనింగ్ క్యాంపు

కృష్ణాజిల్లా యువజనసంఘ కార్యదర్శి కాటినేని సూర్యప్రకాశరావుగారు ఇలా వ్రాయుచున్నారు.

కృష్ణాజిల్లా యువజన సంఘ ఆధ్వర్యాన పెడనలో 17 వ తేదీనుంచి 24 వ తేదీవరకు స్పోర్ట్సులో నిపుణులుగా తయారుచేయుటకు క్యాంపు నడుపబడింది. దీనికి వివిధతాలూకా, పట్టణాలనుండి 14 గురు: స్థానికంగా 6 గురు యాత్రికులు వివిధములయిన ఆటలలో ప్రవీణత గాంచిరి.

1. చెడుగుడు; 2. కొక్కు; 3. చెస్‌పట్టి; 4. పొడుగుదూకుట; 5. ఎత్తు దూకుట; 6. మైలుపరుగు; 7. హర్డిల్స్; 8. అడ్డదిడ్డముపరుగు; 9. కర్రతో ఎత్తు దుముకుట; 10. క్రికెట్ బంతి విసరుట; 11. మోకు లాగుట; బేస్‌బాల్, వాలీబాల్ మొదలగునవి.

ఈశిక్షణ పొందినవారు గుడివాడ, గన్నవరం, బెజవాడతాలూకాలలో తాలూకాక్యాంపులు పెట్టి తాలూకాలోని యువకులకు శిక్షణ యిచ్చెదరు. (అగష్టు 15 వ తేదీనుంచి) కాన పైతాలూకాలలోని యువకులు శిక్షణ పొందగోరువారు ఆ యా తాలూకా యువజన సంఘ కార్యదర్శులకు అగష్టు 10 వ తేదీ లోపలనే తెలియపర్చవలసినదిగా కోరుచున్నాను.

★ రైల్వే కార్మికుల మహాసభలు

యస్. యస్. యం. రైల్వే పనివారల సంఘపు గుంతకల్లు బ్రాంచి 6 వ వార్షిక మహాసభ గుంతకల్లునందు 18-7-43 వ తారీఖున యూనియన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ కె. యల్. నరసింహం అధ్యక్షతక్రింద జరిగింది.

ఉదయం 11-30 గంటలకు యస్. యస్. రైల్వే పనివారల సంఘ ఉపాధ్యక్షులు కామ్రేడ్ మఖ్దూమ్ మొహిదీన్ పతాకోత్సవము జరిపిరి. కామ్రేడ్ మఖ్దూమ్‌పై నైజాం ప్రభుత్వము కేసు మోపుటచే వారు బెయిలుపై నున్నారు. అందుచేత ఉపన్యాస మీయలేదు. "అబ్‌నహ్‌మె పతాకనాచతాహై" అను జండాపై గీతమును, ఇంకా ప్రజాయుద్ధంపై వ్రాసిన గీతాలను పాడారు. అనంతపూరు జిల్లా కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ నాగిరెడ్డి ఎర్రజండా ప్రాముఖ్యతనుగూర్చి చెపుతూ ఈజండాక్రింద ఎర్రసైన్యము ఫాసిస్టులను హతమార్చుటకు ఎలాంటి కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నదో, రైల్వే కార్మికులు యీప్రజాయుద్ధంలో ట్రాన్సుపోర్టును నడుపుతూ, ప్రజలకు—సైన్యాలకు అవసరవస్తువులను అందజేయుటద్వారా తమబాధ్యతను ఎలా నెరవేర్చాలో చెప్పారు.

అన్నిప్రాంతములనుండి ప్ర తి ని ధు లు వచ్చిరి. ప్రతినిధుల సమావేశమైన తరువాత, 400 మంది కార్మికులతో పెద్దఊరేగింపు బయలుదేరి రైల్వే కాలనీ చుట్టెను. సాయంత్రం 5-30 గంటలకు రైల్వేయిన్‌స్టిట్యూట్ హాలులో సభ ప్రారంభమయింది. ఆహ్వానసంఘాధ్యక్షులు కామ్రేడ్ మహబూబ్‌ఖాన్ ప్రతినిధులను ఆహ్వానిస్తూ, ఇప్పటి దేశపరిస్థితులలో ఆహార సమస్యను పరిష్కరించుటకు, దేశాన్ని రక్షించుటకు, ప్రతికార్మికుడు యూనియన్‌లో చేరి దానికార్యక్రమాన్ని బలపర్చాలని చెప్పిరి.

ప్రారంభోపన్యాసం

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు సహాయకార్యదర్శి కామ్రేడ్ యస్. యస్. మిరాజ్‌కర్ సభను ప్రారంభిస్తూ, ప్రజాయుద్ధములో రైల్వే కార్మికులు నిర్వహించవలసిన పవిత్రకార్యాన్నిగూర్చి చెప్పారు. వారు, ట్రాన్స్‌పోర్టును నడుపుటకు, ఉత్పత్తి నెక్కువ చేయుటకు, సమర్థతతో పని చేయాలన్నారు. దేశాన్ని రక్షించటానికి, ప్రజలకు ఆహారము దొరుకునట్లు చేయుటకు, యిదే దేశభక్తిపూరితమయిన కార్యక్రమ మన్నారు. సమ్మెలు యీరోజున దేశానికి, కార్మికులకు హానికర మన్నారు. ఈరోజున సమ్మెలు కార్మిక ఉద్యమాన్ని బలపర్చవు సరికదా, పైగా ప్రజల ఐక్యతను పాడుచేసి జపానుఫాసిస్టులకు సహాయపడతాయని చెప్పారు. కార్మికుల కోర్కెలను రాబట్టుకోవాలంటే నూటికి నూరుమందీ యూనియన్‌లో చేరాలన్నారు. సమర్థతతో పనిచేసిప్రజల అవసరాలకు తోడ్పడుటకు రైళ్ళను నడుపుతూ, ప్రజల సహకార సానుభూతులను సంపాదించాలన్నారు. కార్మికులకు రాజకీయాలతో సంబంధం లేదనుకోవడం పొరపాటన్నారు. రాజకీయాలతో సంబంధం పెట్టుకుంటేనే కార్మికులు తమ యిబ్బందులనుండి గట్టెక్కగలరని చెప్పారు. ఉదాహరణగా జాతీయ ప్రభుత్వమే ఉన్నట్లయితే యుద్ధ అలవెన్సు విషయంలో రైల్వేబోర్డు యిప్పుడు యిచ్చిన సమాధానాన్ని యివ్వటానికి జంకేదన్నారు.

తరువాత యస్. ఐ. రైల్వే యూనియన్, హుబ్లీ మొదలగు ప్రాంతములనుండి వచ్చిన సందేశాలు చదువబడెను. యస్. యస్. రైల్వేనుండి వచ్చిన ప్రతినిధులు మాట్లాడిరి. కామ్రేడ్ వెంకటేశ్వరరావు గొల్లసుద్దులు, కోయవేష ప్రదర్శనాలతో కార్మికులకు ఫాసిస్టు వ్యతిరేక ప్రబోధంజేశారు.

అధ్యక్షోపన్యాసం

కామ్రేడ్ కె. యల్. నరసింహం తన అధ్యక్షోపన్యాసంలో ప్రజలను, దేశాన్ని రక్షించటానికి బలమైన, నిర్మాణయుక్తమైన సంస్థను తయారుచేసి, ట్రాన్సుపోర్టును సమర్థతతో నడపాలన్నారు. యూనియన్‌ను బలపరచుటకు ప్రతిసెక్షను, స్టేషన్ డిపార్టుమెంటు కమిటీలను స్థాపించి ట్రాన్సుపోర్టు సమర్థతను అభివృద్ధి పరచుటలో రైల్వేఅధికారులకు ఖచ్చితమైన సలహాల నిస్తుండాలని చెప్పారు.

ప్రస్తుత రాజకీయ సంక్షోభాన్ని తొలగించి వెంటనే జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలని ఒక తీర్మానంలోను, మరొక తీర్మానంలో యుద్ధ అలవెన్సు విషయంలో అడ్జూడికేటర్‌ను (నిర్ణయాధికారి) నియమించాలని కోరుతూ; మూడవ తీర్మానంలో దేశాన్ని, ప్రజలను రక్షించుటకు ట్రాన్సుపోర్టును సమర్థతగా నడుపుటద్వారా కార్మికులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలని కార్మికులను ప్రబోధిస్తూ యింకా యితర తీర్మానాలు చేయబడ్డాయి.

ఈక్రిందివారిని మరుసంవత్సరానికి కార్యకర్తలుగా యెన్నుకొనిరి:

అధ్యక్షులు: కామ్రేడ్ యస్. గురుస్వామి.
ఉపాధ్యక్షులు: కామ్రేడ్ ఐ. హెచ్. స్లానీ.
కార్యదర్శి: కామ్రేడ్ యం. గోవిందులు.
సహాయకార్యదర్శులు: కామ్రేడ్సు (1) యస్. ఎ. మజీద్, (2) షేక్ యిబ్రహీం.
కోశాధికారి: కామ్రేడ్ మహబూబ్‌ఖాన్.

బెజవాడ

యం. యస్. యం. రైల్వే పనివారల సంఘపు 17 వ వార్షిక సమావేశం బెజవాడలో జులై 25 వ తేదీని జరిగింది. ఉదయం 11 గంటలకు 200 మంది వివిధప్రాంతాలనుంచి వచ్చిన రైల్వే పనివారలతోనూ, 100 మంది స్థానిక మునిసిపల్, ఫ్యాక్టరీ, ప్రెస్ కార్మికులతోను, ఊరేగింపు జరిగింది. రైతుకూలీ చిత్రాలతో, అరుణపతాకాలు రెపరెప లాడుతుండగా కార్మిక బ్యాండుతో, "దేశరక్షణకు రైల్వే కార్మికులు రైళ్ళను చురుకుగా నడపాలి," "జాతివివక్షతలు నశించాలి," "రు 30 యుద్ధభత్యం కావాలి," "కాంగ్రెస్-లీగులు ఏకంకావాలి," "దేశరక్షణకు జాతీయప్రభుత్వం కావాలి," అనే నినాదాలు మిన్నుముట్టాయి. యూనిఫారాలతోనూ, పనినుండి దిగిన మురికి గుడ్డలతోనూ కార్మికుల ఊరేగింపు రైల్వేకాలనీని చుట్టివస్తుంటే, యీ దృశ్యాన్ని చూచిన స్త్రీలు, పిల్లలు, ఉద్యోగులు, పౌరులు, 'కార్మిక వర్గం కదలివస్తోంది! అల్లదిగో ఎర్రబావుటా!' అని అనుకుంటూంటే, "కదనభూమికేగుదాం! కత్తిమోసిదూకుదాం" అనే పాట ప్రతిధ్వనించింది.

నైజాం రైల్వే పనివారల సంఘంనుంచి సౌహార్ద్ర ప్రతినిధులు 12 మంది యీ సభకు వచ్చారు. వారిలో కామ్రేడ్ మక్దూం ఎర్రజెండాను ఎగురవేశాడు. కామ్రేడ్ సి. వి. కె. రావు ఎర్రజెండా సాంప్రదాయాన్ని, ప్రతిష్టను, గౌరవాన్ని, ఆశయాలను గురించి, నేటి పరిస్థితులలో అది సాధింపబోతున్న అమోఘ విజయాన్ని గురించి ఉపన్యసించారు. రైల్వే కార్మికులు నేడు దేశరక్షణకు పూనుకోవాలని ఉద్బోధించారు.

విషయ నిర్ణయసభలో భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకొని, నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గాబోవు సంవత్సరానికి కామ్రేడ్ పోలేపెద్ది నరసింహమూర్తి గారిని ఉపాధ్యక్షునిగాను, యస్. రాఘవయ్య గారిని కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

తీర్మానాలు

రోజురోజూ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, ఆహారవస్తువులు దొరకడమే దుర్లభమవడం గమనించి, రైల్వేకార్మికులకు 30 రూ /- యుద్ధ అలవెన్సు యివ్వాలనీ, 50-100 మంది కార్మికులు పనిచేయుచున్న ప్రతికేంద్రంలోనూ చౌకడిపోలను స్థాపించవలెననీ, కోరుతూ తీర్మానాలు చేయబడ్డాయి. పై హక్కులను సంపాదించుటకు రైల్వేకార్మికులు నూటికినూరుమంది తమ యూనియన్‌లో సభ్యులుగా చేరాలనీ, ఈకోర్కెలను సంపాదించటానికి స్టేషన్ కమిటీలను, సెక్షనల్ డిపార్టుమెంటు కమిటీలను ఏర్పాటుచేసి, 15 రోజులకొకసారి సమావేశపరచాలనీ కార్యక్రమ మివ్వబడింది. మిత్రరాజ్యాల సైన్యాలకు ఎర్రసేనకు అభివందనాలు తెలుపుతూ తీర్మానించబడింది.

రైల్వే ట్రాన్స్‌పోర్టును నడపటంలో వివిధ డిపార్టుమెంటుల కార్మికులు యీ క్రింది కర్తవ్యాలను నెరవేర్చాలి:- (1) రైల్వే లైను దృఢంగా వుండునట్లు ఏరోజు కారోజు మరమ్మతు చేస్తూ కాలువలపైన, నదులపైనవున్న వంతెనలు దిట్టంగా వుండునట్లు యింజనీరింగ్ పనివారలు చూస్తుండవలెను. అధికార్లయిండ్లలో స్వంతపనులు చేయుటకు ఎవరునూ రైల్వే పనిని వదలివెళ్ళగూడదు. (2) లోకోపనివారలు యింజన్ల మరమ్మతులను చక్కగా చూస్తూ త్వరత్వరగా యింజన్లు సప్లయి అవుతుండేటట్లు చూడవలెను. (3) ట్రాఫిక్ పనివారలు యార్డులో ట్రయిన్ షంటింగ్ త్వరగా పూర్తిఅయి త్వరగా సాగిపోవునట్లు చూడవలెను. ఈవిధంగా రైల్వే కార్మికులుపనిజేస్తూ బొగ్గులోనూ, ఆయిల్సు వగైరా స్టోర్సు వస్తువులలోను దుబారా ఖర్చులేకుండా పొదుపుగా వాడవలెను.

బహిరంగసభ

సాయంత్రం 6 గంటలకు కామ్రేడ్ కె. యల్. నరసింహం అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది నైజాం కార్మిక నాయకులు రామచంద్రరావుగారు ఉపన్యసించాక అధ్యక్షులు మాట్లాడారు. రైల్వే కార్మికులు దేశరక్షణ కొరకు సరఫరా సౌకర్యాలను ఇంకా ఎక్కువ చేయాలనీ, ఇంజన్లు చెడిపోడానికి ఉదాహరణలు చెప్పి, కార్మికుల సలహాలను అధికారులు తీసికోవాలనీ చెప్పారు. కార్మికులు అందరూ తమ సంఘములో చేరి దేశరక్షణలను బలపరచుటద్వారానే తమ హక్కులను సాధించగల్గుతారు. కార్మికుల ఐక్యత, జాతీయ ఐక్యతకు దారిచూపాలనీ, జాతీయ ప్రభుత్వం అవసరాన్ని గురించి నొక్కిచెప్పి, ఉపన్యాసాన్ని ముగించారు.

బిట్రగుంట

22-7-43 వ తేదీన కామ్రేడ్ పి. దొరస్వామినాయుడు అధ్యక్షతను రైల్వేకార్మికుల బహిరంగ సభ జరిగింది. దానిలో బ్రాంచి ఆర్గనైజరు ఏ. వి. కృష్ణయ్యగారు ఆహార కమిటీ తీర్మానాలను వివరించారు. బిట్రగుంటలో కార్మికులకు సప్లయిచేసే బియ్యం నాశరకంగా వున్నాయనీ, మంచిబియ్యం సప్లయి చేయాలనీ, కోరారు. డిపోలలో పంచదార, చింతపండు, టీ దొరకుటలేదనీ, అవికూడా సప్లయిచేయాలనీ అధికారులను కోరారు. కమర్షియల్ మానేజరు సప్లయి చేస్తామని వాగ్దానం చేసిన నెయ్యి, సబ్బు, స్టాండర్డు బట్టలను వెంటనే సప్లయిచేయాలని కోరారు.

యుద్ధఅలవెన్సును అఖిలభారత రైల్వే కార్మికుల ఫెడరేషను కోరినట్లుగా వృద్ధిచేయాలనీ, పరిష్కారం చేయడానికి అడ్జుడికేటరును (నిర్ణయాధికారి) నియమించాలనీ కోరారు. మిలిటరైజేషన్ స్కీమును అమలు జరపడంలో వాగ్దానాలకు విరుద్ధంగా చూపుతున్న జాతివివక్షణను తొలగించాలని కోరుతూ తీర్మానించారు.

వైజాగ్ హార్బరు కార్మిక సంఘ ఎన్నికలు

విశాఖపట్టణ హార్బరు అండ్ పోర్టు కార్మిక సంఘ అష్టమ వార్షిక సభ 22 వ తేదీ (జులై) ఆంధ్రకమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్య అధ్యక్షత క్రింద జరిగింది. "హార్బరు కార్మికులీనాడు తమ పనిని అంటిపెట్టుకొని వుండడమంటే ఒక్క విశాఖపట్టణాన్నేకాదు—భారత దేశాన్ని జపాను ఫాసిస్టుల క్రిందికి పోకుండా రక్షించడమన్నమాట. ఇంతభారం మీమీద ఉంది. సంఘం వేయిరెట్లు బలపర్చుకోవాలి. సంఘ ద్రోహుల్ని, దేశద్రోహుల్ని తొలగించివేయాలి. ఐక్యతను కాపాడుకోవాలి" అని అధ్యక్షుడుద్బోధించాడు.

1942-43 సం॥ రిపోర్టును కార్యదర్శి కామ్రేడ్ పైడాడ అప్పన్న చదివాడు. యుద్ధ సమయంలోకూడ కార్మికసంఘ బలంవల్ల ఎటువంటి విజయాలు సాధించారో వివరించారు. దేశాన్ని రక్షించుకొనేందుకై కార్మికులందరు సంఘంలోచేరాలని కోరారు.

తరువాత ఎన్నికలు జరిగాయి. క్రిందటి సంవత్సరం అధ్యక్షుడుగా పనిచేసిన వై. విజయకుమార్, బుద్ధిరాజు మల్లికార్జునరావుగార్లు అధ్యక్షస్థానాలకు సూచింపబడ్డారు. ఓటింగు జరిగింది. సభకు హాజరైన సంఘసభ్యులు 500 మందిలో 450 మంది కామ్రేడ్ వై. విజయకుమార్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు. ప్రతికక్షి అదిచూచి దెబ్బలాటకు దిగారు. అందుచేత తరువాత కార్యక్రమం ఆపివేయబడింది.

యుద్ధసమీక్ష

—అక్షరాజ్యాలను మహావిపత్తు ఆవరించుతోంది

ముస్సోలినీస్థానే మార్షల్ బడోగ్లియో అధికారం స్వీకరించాడు. మార్షల్ బడోగ్లియో ప్రభుత్వం రాచరికవాదుల (మోనార్కిస్టుల)ను ప్రతిబింబించుతోంది. ఇటలీరాజు, ఇటాలియన్ కాథలిక్ మతమఠాధిపతుల సపోర్టు వీరికివుంది. సైన్యంలోకూడ వీరికి పలుకుబడివుంది, ముస్సోలినీ ఫాసిస్టు మిలీషియా, సాధారణ సైనికుల తీవ్ర అసమ్మతికి ఇదివరకే పాలయివుంది.


బడోగ్లియో, ఫాసిస్టు పార్టీని రద్దుచేశాడు. ఫాసిస్టు నాయకులను అరెస్టుచేశాడు. ఫాసిస్టు చిహ్నాలను ప్రతిచోట తొలగింపజేశాడు. తన మంత్రి వర్గంలో చెప్పుకోదగ్గ ఫాసిస్టు నాయకులెవరినీ ఉంచలేదు. ఫాసిస్టు మిలీషియాను రద్దుచేసి సైన్యంలో కలిపివేశాడు. (కాని పూర్తిగా అరెస్టుచేసి అణచివేయలేదు.) ఫాసిస్టు ప్రతికూలతతో ఉద్రిక్తులయిన ప్రజలీ చర్యల్ని బాగా సపోర్టు చేశారు. ఇంతటితో ఫాసిస్టు ప్రభుత్వం అంతమయిందని తలచిన ప్రజలసంరంభం దేశాన్నంతాకదిలించివేస్తుంది, హిట్లరుకు ఇటలీదేశాన్ని అమ్మిన ముస్సోలినీ రాజనీతిని బడోగ్లియో విడిచిపెట్టాలని ఇటలీ ప్రజలు కోరుతున్నారు.

కాని బడోగ్లియో పాత్ర అనుమానాస్పదంగానేవుంది. ఒకప్రక్క "యుద్ధంకొనసాగుతుంది." అని చెబుతున్నాడు. మరొకప్రక్క యుగోస్లేవియా, గ్రీసు, ఫ్రాంసులనుండి 26 డివిజన్ల సైన్యాన్ని ఇంటికి రావలసిందని కోరాడు. ఐసన్‌హోవర్, చర్చిల్, రూజువెల్టుల సందేశానికి జవాబులేదు. ఇటలీ బేషరతుగా లొంగాలి, లేకపోతే, అన్నివిధాల మారణం మారణం చేస్తామని చర్చిల్ హెచ్చరించాడు. మిత్రరాజ్యాల శాంతి ప్రతిపాదనలను "ఇటాలియనులు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు." అని రోం రేడియో చెప్పడంతప్ప మరెట్టి సమాధానమూ రాలేదు. ఇటలీ, జర్మనీతో సంబంధం వదులుకొనలేదుగన తిరిగి విమానయుద్ధం కొనసాగించుతామని మిత్రరాజ్యాలు హెచ్చరించాయి.

ఇటీవలనే, ముస్సోలినీ పతనానికి పూర్వం లిబరల్సు, సోషలిస్టులు, కార్మికనాయకులు, కాథలిక్కులు కమ్యూనిస్టులతో గూడిన ఒక ఫాసిస్టు వ్యతిరేక కూటమి ఏర్పడిందని వార్త వచ్చింది. ఆకూటమి ఇప్పుడు బహిరంగంగా పైకి వచ్చియుంటుంది. ఇలాంటి నిజమైన ఫాసిస్టు వ్యతిరేకులతో చేతులుకలిపి, హిట్లరుకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, మిత్రరాజ్యాలతో ప్రత్యేకసంధి చేసికొని ఇటలీ స్వాతంత్ర్యాన్ని సంపాదించవలసిన బాధ్యత బడోగ్లియో మీదపైవుంది. లేక ముస్సోలినీ లేకుండా, ముస్సోలినీ పంథాయే అవలంబించాడా, ఇటాలియన్ ప్రజలది సహించరు. ఇటలీపై జర్మనీ పెత్తనం ఇక ఏమాత్రమూ సహించరనడానికి ఇటీవల విజృంభించిన ప్రజాసంరంభమే నిదర్శనం. ప్రజా ప్రదర్శనాలు, సమ్మెలు ముఖ్యపట్టణా లన్నిటిలోను జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా 'మిలాన్' నగరం ముందంజవేసింది. కమ్యూనిస్టుల నాయకత్వంక్రింద ప్రదర్శనాలు జరుగుతున్నాయి. రాజుకు, బడోగ్లియోకు కూడా వ్యతిరేకంగా సమ్మెలు, ప్రదర్శనాలు జరుగుతున్నాయనివార్త, మిలటరీకూడ కార్మికులపై కాల్పనిరాకరించింది. రోంరేడియో, "దేశం తిరుగుబాటుదార్ల అపాయానికి గురిఅవుతోంది" అని చెప్పుకోవలసి వచ్చింది.

అనేక బ్రిటిషు పత్రికలు భావించుచున్నట్లు బడోగ్లియో గనుక, ఇటాలియన్ ప్రజలకు ద్రోహంచేసి, జర్మనీకి అంటిపెట్టుకొని యుంటే, ఇటాలియన్ కార్మికవర్గమూ, ప్రజాస్వామ్య శక్తులూ సహించవు. ముస్సోలినీకి పట్టిన గతే బడోగ్లియోకు పడుతుంది. మిత్రరాజ్యాలు కొట్టేదెబ్బలు, అట్టి పతనాన్ని దగ్గరకు తీసుకొస్తాయి.

ముస్సోలినీ లేకుండా, ముస్సోలినీ రాజ్యంగాన్నే సాగించదలచితే; వారికి వ్యతిరేకంగా ఇటాలియన్ ప్రజలు గావించే పోరాటాన్ని మిత్రరాజ్యప్రజలు బలపరుస్తారు. "ముస్సోలినీతోడి నేరస్థులను గుర్తించడంగాని, వారితో ఎట్టి సంధికి దిగడంగాని, జరగకుండా నిరంతరం పోరాటం సాగించుతాం," అని బ్రిటిషు కార్మికవర్గం, ఇటాలియన్ కార్మికులకు హామీ


ఇక ఈబండి ఈడ్వలేను అంటూ ముస్సోలినీ వెలికిల బడ్డాడు

ఇచ్చింది. హెర్బర్టు మారిసన్ హెచ్చరిక కూడా ఇదే తెలియజేస్తుంది.

గత మేనెలలో కామ్రేడ్ స్టాలిన్, ఫాసిస్టు రాజ్యాలలో రగుల్కొంటున్న విప్లవాగ్నిని సూచించాడు. "జర్మను-ఇటాలియన్ ముఠా మహాక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది. మహావినాశనాన్ని పొందబోతున్నది" అని అన్నాడు. ఈనాడు ఇటలీలో అదిప్రత్యక్షమైంది. ఇటలీని యెంతత్వరలో యుద్ధంనుండి విరమింపజేస్తే అంతత్వరగా, దీని ఫలితాలు జర్మనీలో మరింత కన్పించుతాయి. జర్మనీలో విషమించిన పరిస్థితులను మరింత ఎక్కువ చేస్తాయి. తదితర ఆక్రమిత దేశాలలోను, జర్మనీ తొత్తుగా పనిచేసే దేశాలలోను, పరిస్థితులు తలక్రిందులవుతాయి. ఇప్పటి జర్మనీ స్థితి ఏమిటి?

ఇంట ప్ర తి ద్వం దు ల పోటుకు, బయట పరాయి శత్రువుల దెబ్బలకు తాళలేని ముస్సోలినీ హిట్లరును సాయపడమంటే, "డోలువెళ్ళి మద్దెలకు మొరపెట్టుకోడమా?" నాచేత గాదు పొమ్మన్నాడు. హిట్లరు వేసవి దండయాత్ర భగ్నమయింది. రెడ్‌ఆర్మీయే, తమ దాడిని వేసవి దండయాత్రగా పెంపొందించి ప్రయత్నించుతోంది.

ఓరెల్‌ను మూడు ప్రక్కల క్రమ్ముకొని వస్తున్న రష్యను సైన్యాలు, 2½ లక్షల జర్మన్లనుచుట్టుముట్టాలని ప్రయత్నించుచున్నాయి. ఓరెల్ వద్ద కలిసే రైలుమార్గాలు మూడింటిపైన సోవియటు సైన్యాలున్నాయి. ఇవి 10 మైళ్ళేని దూరంలో వున్నాయి. రెడ్‌ఆర్మీ పురోగమనాన్ని ఆపడానికి, హిట్లరు, పాంజరు దళాలతో కొడుతున్న దెబ్బలు విఫలమవుతున్నాయి. వారోషిలావ్‌గ్రాడ్‌కు నైరుతిగా, హిట్లరు సాగించిన దాడికూడ, ఇంతవరకు ఫలించలేదు.

హిట్లరు యీవిధంగా తింటున్న దెబ్బలు జర్మనీలో విషమపరిస్థితులను పెంపొందింపజేయగలవు. ఇప్పటికే, రోజురోజూ, జ ర్మ ను సై ని కు లు సో వి య టు వైపుకు వస్తున్నట్లు తెలుస్తుంది. మాస్కో రేడియో, రోజూ, అలావచ్చినవారు గావించే స్టేటుమెంటులను ప్రకటించుతోంది. మిత్రరాజ్య విమానజలాలు కొట్టే దెబ్బలకు, ఆటు జర్మను ప్రజలలోకూడ అసమ్మతి వ్యాపించుతోంది. అసమ్మతిప్రదర్శనాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో "ఫ్రీజర్మనీ నేషనల్‌కమిటీ" సోవియటులో ఏర్పడింది. దాని ప్రణాళికలో ఇలా ప్రకటించబడింది, "హిట్లరును కూలద్రోయడం, ఒక్క మిత్రరాజ్యాలచేతులకే వదలివేయవద్దు. అలా చేస్తేజర్మనుస్వాతంత్ర్యం నశిస్తుంది. యుద్ధంలో జర్మనీఓడుతోంది. వినాశనంసమీపించుతోంది. జర్మను సైనికులకు అన్నిరంగాలలోను అపజయాలున్నాయి. వాటిని, హిట్లరుపైకి త్రిప్పండి" అని ఈ ప్రణాళిక హెచ్చరించింది. ఒక్క మిత్రరాజ్యాలమీదనేఆధారపడక, తమంతకు తామే చొరవదీసుకొని, హిట్లరును కూలద్రోయండని ఈ ప్రణాళిక జర్మను ప్రజలను ఉద్బోధిస్తుంది, మిత్రరాజ్యాలు, సోవియట్ యూనియనూ రోజురోజూ తీస్తున్న దెబ్బల ఫలితంగా, జర్మనీలో ఈకమిటీకి సహకారం వస్తుందనడంలో, సందేహంలేదు. ఇటలీ ఎంతత్వరలో యుద్ధం నుండి తొలగితే, జర్మనీలో అంత త్వరగా ఈకమిటీకి సహాయం లభించుతుంది.

ముస్సోలినీ పతనం, అప్పుడే ప్రజాశక్తుల విజృంభణకు, దారితీసింది. హిట్లరు తొత్తులుగా పనిచేస్తున్న దేశాలలో నైతికపతనం గల్గించింది. యుగోస్లావ్ గెరిల్లాల విజృంభణ హెచ్చింది. రుమేనియా, హంగరీలలో నైతికపతనంప్రారంభమయింది. స్పైన్‌లో కల్గిన అపజయ భీతినాధారంగాతీసుకొని, కొందరు రాచరికవాదులు తమ పెత్తనం స్థాపించాలని ప్రయత్నిస్తున్నారు. ఈఆటలు సాగకుండా, ప్రజాస్వామ్య శక్తులకే మిత్రరాజ్యాలు చేయూత నీయాలి. ఈనాడు వెంటనే అన్నిచోట్లనుండీ, దెబ్బతీసి ఫాసిస్టులలో గల్గిన చీలికలను మరింత విశాలం చేసి, అక్షరాజ్యాలను హతమార్చాలి. 2-8-43

—తుమ్మల వెంకటరామయ్య.

(2 వ పేజీ తరువాయి) అధికారవర్గం ఎలాంటి ప్రజావ్యతిరేకపంథా నవలంబిస్తున్నదో, ఆర్థిక రంగంలోకూడా అట్టి వైఖరినే ప్రదర్శించడంవల్ల దేశంలో ఆహార సంక్షోభం భయంకర రూపం దాల్చుతోంది. మలబార్‌లో, జూలై 24 వ తేదీకి కలరావల్ల మరణించినవారి మొత్తం సంఖ్య 10,549 (మ్యునిసిపల్ పట్టణాలు మినహాయించి). వీరిలో 3,137 గురు ఒక్కవారంలో (జులై 17 మొదలు 24 వరకు) చనిపోయారు! కలకత్తా నగరవీధులలో యీమధ్య అన్నంలేక చనిపోయినవారి సంఖ్య ఎక్కువై, అట్టి శవాలను తొలగించే విషయమై కార్పొరేషన్‌లో ఒక ప్రత్యేక చర్చఅవసరమైంది. ఒకపబ్లిక్ సంస్థ వీధులనుండి 27 శవాలను తీసివేసిందని ఆల్డర్‌మన్ అహమ్మద్‌గారు చర్చ సందర్భంలో తెలియజేశాడు. రాయలసీమ కరువు క్యాంపులలోను, కరువు క్యాంపుల బయట, ప్రజలుపడే బాధలు వర్ణనాతీతం. పరిస్థితులు యీ విధంగా నానాటికి విషమిస్తుంటే, మద్రాస్‌ప్రభుత్వ ఎడ్వైజరు సర్ హ్యూ హుడ్ వ్యాపారస్తులవద్ద, ఇతరుల వద్ద నేడు నిలవవున్న సరుకెంతో ప్రభుత్వానికి తెలియదంటూ చెప్పవచ్చాడు! బొంబాయి నగరంలో రేషనింగు చిక్కులతో కూడుకొనియున్నదనీ, మదరాసు రాజధానిలో సులభంగా దీన్ని ప్రవేశపెట్టజాలమనీ, అతడు తెలియజేశాడు. అతడే మరొక ఉపన్యాసంలో రాబోయే రెండునెలలూ సంవత్సర మంతటిలోను గడ్డురోజులన్నాడు. మన మదరాసు రాజధానికి ఇతర రాష్ట్రాలు సహాయంచేయడంలేదని ఒకవైపు వాటిని నిందిస్తూ, మరొకవైపు మద్రాసు రాజధానినుండి సరుకును ఎగుమతి చేయకూడదని సూచించాడు! కేంద్రశాసన సభలోకూడా ఆహారసమస్య చర్చకు వచ్చినప్పుడు, నిలవ వ్యాపారస్థులవద్దనున్న మొత్తంసరుకెంతోచెప్పడం కష్టమనిప్రభుత్వసభ్యుడు తెలియజేశాడు.

నిస్సహాయస్థితి

ఈవిధంగా, నిరంకుశాధికారవర్గం ప్రజాసహకారంలేకుండా సమస్యను పరిష్కరించ పూనుకోవడంవల్ల ఎంత నిస్సహాయస్థితిలో పడిందో, ఎన్ని అవకతవకలకు కారణముయిందో, స్పష్టంగా తెలుస్తోంది. ప్రజాసహకారం తీసుకుంటే, నిలవవ్యాపారస్థులవద్దనున్న మొత్తం సరుకెంతో తెలియడమే గాకుండా, దాన్ని సక్రమంగా వినియోగించే పద్ధతులుకూడా తెలుస్తాయి. రేషనింగు, ధరల కంట్రోలు, న్యాయ విభజన, మొదలైన సమస్యలన్నీ సులభంగా పరిష్కరించబడతాయి. ఈ విషయంలో మద్రాసు ఆహారకమిటీ సూచించిన స్కీము ఎంతో ఆచరణయోగ్యంగా ఉంది ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా ఉండే జస్టిస్‌పార్టీ సహితం నిలవవ్యాపారస్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని తీర్మానించిందంటే, ప్రజలకు ప్రభుత్వం ఎంత దూరమై ఉందో బోధపడగలదు.

నాయకుల నిస్పృహ

దేశంలో యీవిధంగా నానాటికి వృద్ధిచెందే జాతీయసంక్షోభంనుండి ప్రజల్ని ర క్షిం చాలంటే, వివిధ రాజకీయపార్టీలు కలిసి ప్రజాశ్రేయస్సుకై పాటుపడాలి. కాని, మన జాతీయ నాయకుల నిస్పృహ తొలగడంలేదు. శ్రీగోపీనాధశ్రీవాస్తవ ఆగస్టు కాంగ్రెసుతీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని చేసిన సూచనకు ఎక్కువమంది కాంగ్రెసువాదులు వ్యతిరేకించడంచూచి, ఇది గాంధీజీ–వర్కింగ్‌కమిటీ సభ్యుల చేతులలోనే ఉన్నదంటున్నాడు. కాంగ్రెసువాదులులేని సంయుక్త మంత్రివర్గాలను వ్యతిరేకించుతున్నాడు. ముస్లింలీగ్ అధ్యక్షుడైన జిన్నాను యీమధ్య ఒకవ్యక్తి కత్తితో పొడిచి, చంపప్రయత్నించాడు. ఆవ్యక్తి ఏఉద్దేశంతో యీ పనిని చేసినా, ఒక ప్రజాసంస్థ నాయకుణ్ణి హత్యచేయ ప్రయత్నించడం దేశానికి హానికరం. నేడు వివిధపార్టీలమధ్య ఏర్పడియున్న యీ అగాధాన్ని పూడ్చడం ప్రతిదేశభక్తుని కర్తవ్యం అయివుంది. ముస్లిం జాతుల స్వయంనిర్ణయ హక్కును అంగీకరించడమే అట్టి ఐక్యతకుపునాది. 2—8—43

కమ్యూనిస్టుపార్టీకి బలం యెక్కణ్ణించి వస్తోంది?

గత సంవత్సరం జూన్ నెలనాటికి రాజషాహి జిల్లాలో (బెంగాల్) కమ్యూనిస్టు పార్టీలో ఇద్దరు సభ్యులుమాత్రం ఉండేవారు. ఈరోజున 132మందివున్నారు. రైతుసంఘంలో గతసంవత్సరం 700 మంది సభ్యులుండేవారు. ఈయేడు ఆ సభ్యత్వం 2,500 కు పెరిగింది. విద్యార్థిసంఘం 300 నుంచి 850 కు పెరిగింది. స్త్రీల ఆత్మరక్షణసంఘం నిరుడు లేనేలేదు. ఈరోజున 850 మంది సభ్యురాండ్రతో ఆత్మరక్షణ సమితి పనిచేస్తోంది.

కమ్యూనిస్టులకు యింతబలం యెక్కడ నుంచి, యెలా, వచ్చిందో చూదాం.

రాజషాహి జిల్లాలో మహ్మదీయులు అధిక సంఖ్యాకులు. ఎన్నో సంవత్సరాలుగా ఆజిల్లా ప్రజలు మతవైషమ్యాలతో చీలిపోయిఉండేవారు. దీనికితోడు, ఆహారసమస్య వారిని పూర్తిగా కృంగదీసింది. నిల్వవ్యాపారస్థుల దోపిడీకి హద్దులేకుండా పోయింది. నిరంకుశాధికారుల అవకతవక పద్దతులు నిష్ప్రయోజన మయాయి. అనేకగ్రామాలలో ప్రజలు కటికి ఉపవాసాలు చేయవలసి వచ్చింది.

లీగ్ మంత్రివర్గకృషికి సహాయం

ఇంతలో బెంగాల్ ముస్లిం లీగ్ మంత్రివర్గం రాష్ట్రమంతట నిలవవ్యాపారాన్ని అణచడానికొక కార్యక్రమం వేసింది. అన్ని ప్రజాపార్టీల సహకారం తీసుకోవలసిందని జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. రాజషాహి జిల్లాకుకూడా యిట్టిఉత్తర్వులువచ్చాయి. కాని, ఆజిల్లా అధికారులు తమపాతధోరణిలో ప్రజాసహకారంతో నిమిత్తం లేకుండా, వ్యవహరించారు. ప్రజాసంస్థల సహకారం తన కవసరమేలేదని జిల్లా కలెక్టరు బిగించుకొని కూర్చున్నాడు. ఈ కార్యక్రమం అంతా ఒక నాటకం అని ప్రజలు అనుమానంతో చూచారు. పంచమాంగ దళానికి యీ విధంగా మంచి అవకాశం దొరికింది. దేశంలో ఉన్న సరుకును సైన్యానికి పంపించేయడానికే మంత్రివర్గం ఈ ఉద్యమాన్ని తలపెట్టిందంటూ ప్రజలలో అబద్ధపు ప్రచారం సాగించింది. ఒక్కగింజకూడా అధికారులకు స్వాధీనం చేయవద్దని హెచ్చరికలు గావించింది.

ఈదుష్ప్రచారా న్నెదుర్కొంటూ ప్రజలకు తిండిని సప్లయి చేయడానికి కమ్యూనిస్టులు రంగంలో ప్రవేశించారు. బెంగాల్‌మంత్రివర్గం నిలవ వ్యాపారాన్ని అణచడానికి ప్రారంభించిన కార్యక్రమం ఎలాసరియైనదో ప్రజలకు బోధించారు. ఈకార్యక్రమం వెనుక బ్రహ్మాండమైన ప్రజాసమీకరణ ఉండే. తిండిదొంగల ఆటలు ఎలా కట్టు అవుతాయో స్పష్టపరుస్తూ, జట్లు జట్లుగా ప్రచారం చేశారు. ప్రజా ఐక్యతవల్ల స్థానికాధికారుల మొండితనాన్ని ఓడించవచ్చునని ప్రజలలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది.

ఆహారకమిటీల కృషి

జిల్లా అంతట స్థాపించబడిన 91 ఆహార కమిటీలలో కమ్యూనిస్టులు సభ్యులయారు. 68 కమిటీలలో వీరిదే పైచేయి. ఇంత ప్రజాఐక్యత యెదుట జిల్లాకలెక్టరుమాత్రం ఏమి చేయగల్గుతాడు? మొదట ప్రజాసహకారాన్ని నిరాకరించిన ఈజిల్లాకలెక్టరు ఆహారకమిటీల స్థాపననుగురించి మునిసిపల్ ఛైర్మెన్‌తో చర్చించవలసి వచ్చింది. ఆయన వెంట ఒకరైతుప్రతినిధి కూడా వెళ్ళాడు. ఈ ఉద్యమఫలితంగా కొంత సరుకు నిలవ వ్యాపారస్థులనుండి స్వాధీనం చేసుకోబడింది. కాని, జిల్లా సివిల్ సప్లయి ఆఫీసరు ఒకస్థానిక వర్తకునిద్వారా ఆ సరుకును అమ్మాలని నిశ్చయించాడు. ఈ స్థానికాధికారులకు వర్తకులు తప్ప మరెవరూ కనుపించరు! కాని, ఆహారకమిటీ సభ్యులు వెంటనే కలెక్టరు దగ్గరకు పరుగెత్తి యిలా అడిగారు: "ఈవిధంగా మీరు నిలవ వ్యాపారస్థుల్నే మళ్ళీ పైకి తీసుకొచ్చి ఆహార కమిటీలను పక్కకు నెట్టితే, యీఉద్యమంయొక్క ప్రయోజనం ఏమిటి?" జిల్లాకలెక్టరు ఆలోచించాడు. ఈమాటలలో అర్థం ఉన్నదని గ్రహించి, వర్తకులద్వారా అమ్మించే పద్ధతిని ఆపుచేయించాడు.

ప్రజలు సాధించిన ముఖ్యమైన విజయాలలో మరొకటి యేమంటే, ముగ్గురు కమ్యూనిస్టులమీద ఎప్పుడో పెట్టిన పాతకేసు ఒకటి ఉంది. ఆహారకమిటీ సభ్యులు సబ్‌డివిజనల్ ఆఫీసరు వద్దకెళ్ళి, యిలాచెప్పారు:

"మంత్రివర్గం ప్రారంభించిన ఉద్యమాన్ని జయప్రదంగా నిర్వహించడంలో వీరే ఉత్తమోత్తమమైన వర్కర్లుగా పనిచేశారు. అట్టివారినా, మీరు జైలులో నిర్బంధించడం?" సబ్‌డివిజనల్ ఆఫీసరు కేసును ఉపసంహరించుకొన్నాడు.

పంచమాంగదళం ప్లేటుమార్పు

పంచమాంగదళంవారు, నిల్వవ్యాపారస్థులు బ్రహ్మాండమైన యీ ప్రజాసమీకరణనుచూచి, ప్లేటుమార్చారు.

"ఈఉద్యమంవల్ల ఉపయోగం లేకపోలేదు. కాని, ఉద్యోగస్థులు దీన్ని జయప్రదంగా నిర్వహించరు." ఈ కొత్తప్లేటును ప్రజలు వినే స్థితిలోలేరు. ఐక్యతవల్ల ఎన్నివిజయాలు సంపాదించవచ్చునో తమ అనుభవంద్వారావారు తెలుసుకున్నారు.

అయితే, ఈ విజయాలతో ప్రజలు సంతృప్తిపడి చేతులు కట్టుకొని కూర్చోలేదు. తిండి దొంగలవద్ద పట్టుకున్న సరుకును అమ్మించడానికి చౌకడిపోలు కావాలి. పస్తులు పడే బీద కుటుంబాలకు వెంటనే అన్నం వండిపెట్టాలి. వీటికై ఆహార కమిటీలు జిల్లా అధికార్లపై ఒత్తిడితెస్తున్నాయి.

గ్వాలియర్‌లో రాజకీయ సంక్షోభం అంతమయింది!

★

గ్వాలియర్‌సంస్థానప్రజలలో ప్రచారంగావించే 125 గురు డిటెన్యూలను జైళ్ళనుంచి విడుదలచేశారు. ఇంకాకొందరిపై ఉన్న కేసులను సంస్థాన ప్రభుత్వం ఉపసంహరించు కొనడాని కంగీకరించింది. శిక్షలు విధించబడి, లేదా, డిటెన్యూలుగా నిర్బంధించబడి, జైళ్ళలో మ్రగ్గుతున్న యితర రాజకీయఖైదీలను కూడా ప్రభుత్వంవిడుదలచేయబోతూంది. పోలీసులు ప్రజలపై గావించిన అత్యాచారాలను గూర్చి సైనికశాఖమంత్రి విచారణ చేయనున్నాడు. సంస్థాన ప్రజల సార్వజనికసభనుండి పోలీసులులాక్కున్న ఆస్తిని తిరిగి యిచ్చివేయడాని కంగీకరించారు. గ్వాలియర్ సంస్థానంలో యీ విధంగా రాజకీయ ప్రతిష్టంభన అంతమయింది.

ఈమార్పు యెలావచ్చిందో పరిశీలిద్దాం. గ్వాలియర్ సంస్థాన ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వంతో సంబంధాన్ని తెగగొట్టుకొని, సంస్థాన ప్రజలకు బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఈయవలసిందనీ, అలాయీయని పక్షంలో ప్రజలు పోరాటం ప్రారంభించవలసిందనీ, సార్వజనికసభయొక్క వర్కింగ్ కమిటీ ఒక తీర్మానం చేసింది. వెంటనే నిర్బంధ విధానం ప్రారంభమయింది. నాయకుల విడుదలకై కమ్యూనిస్టులు సంతకాల ఉద్యమం కొనసాగించారు. దానితోబాటు, విధ్వంసక కార్యక్రమంనుంచి అనేకమంది దేశభక్తుల దృష్టిని మరల్చారు. జైళ్ళలోకూడా కమ్యూనిస్టులు "పోరాటవాదు"లతో చర్చలు సాగించి, వారిని ఒప్పించడానికి తీవ్రమైన ఉద్యమం ప్రారంభించారు. మొదటి రోజులలో ఆదేశభక్తులు కోపాన్ని పట్టలేక, కమ్యూనిస్టుల్ని హింసకు గురిచేశారు. ఉదాహరణ: కామ్రేడ్ గోపీకృష్ణకటారి. కాని, క్రమంగా పరిస్థితులు మారి, కమ్యూనిస్టుల్ని సానుభూతితో చూడసాగారు.

ముస్లింలీగ్ కృషి

జనవరి నెలలో సైనికశాఖ మంత్రివద్దకు రాజకీయ ఖైదీల విడుదలకై ఒక రాయబారవర్గం బయలుదేరింది. వర్కింగు కమిటీ సభ్యులలో ఒకరైన ఆర్. ఆర్. తివారి, కొందరు కమ్యూనిస్టులు, ఇతర పార్టీల దేశభక్తులు, యిందులో సభ్యులు. సంస్థాన ముస్లింలీగ్‌కు అధ్యక్షుడైన అబ్దుల్ రషీద్ సాహెబ్ రాయబారవర్గానికి నాయకత్వం వహించి, ప్రభుత్వ శ్రేయస్సుకోరుతూ, ప్రజల శ్రేయస్సు కొరకు, రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయడం ఎలా అవసరమో, ఆతడు నొక్కిచెప్పాడు. కాని, ప్రభుత్వం యీమాటలను పెడచెవిని పెట్టింది. వర్కింగ్‌కమిటీ గావించిన పోరాట తీర్మానాన్ని మొదట ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం వాదించింది.

గాంధీజీ లేఖలు

ఇంతలో గాంధీజీ వైస్రాయికి వ్రాసిన లేఖలు వెలువడ్డాయి. కాంగ్రెసు బురఖా వేసుకున్న పంచమాంగదళం సాగిస్తూ వచ్చిన విధ్వంసక చర్యలనువ్యతిరేకిస్తూ గాంధీజీ వ్రాసిన జాబులు దేశభక్తుల్ని ఆలోచించేటట్లు చేశాయి. జైళ్ళబయట ఉన్న వర్కింగ్ కమిటీసభ్యులను కమ్యూనిస్టులు కలుసుకొని, గాంధీజీ యొక్క లేఖలను గురించి చర్చించారు. ఇంచుమించు అందరూ "పోరాటా"న్ని ఉపసంహరించడం అవసరమేనని ఒప్పుకున్నారు. కాని, ఎవరూ ధైర్యంతో ముందుకు రాలేదు.

కమ్యూనిస్టులు తిరిగి సైనికశాఖామాత్యుని వద్దకు వెళ్ళారు. శివపురి జైలులో నిర్బంధించబడియున్న డిటెన్యూలతో సంప్రతించడానికి అనుమతి కోరారు. దానికి జవాబుగా, అధ్యక్షుడు కోరినట్లయితే యితర వర్కింగ్‌కమిటీ సభ్యులందరినీ శివపురి జైలుకు తీసుకురావడానికి మంత్రి తనఅంగీకారాన్ని తెలియజేశాడు. కామ్రేడ్స్ కటారి, బాలకృష్ణశర్మగారలకుకూడా ఇంటర్వ్యూ లిచ్చాడు. వీరిద్దరూ రెండురోజులు జైలులో ఉండి, నాయకులతో పూర్తిగాచర్చించారు. మొదటి "పోరాట"తీర్మానాన్ని వర్కింగ్ కమిటీ ఉపసంహరించుకొంది.

కాని, సార్వజనిక సభకు చెందిన యితర డిటెన్యూలతో కూడ చర్చించాలిగదా! వివిధ జైళ్ళలో ఉన్న డిటెన్యూలతో సంప్రతించడానికి శ్రీయుత రామసహాయ్ అనే వర్కింగు కమిటీ సభ్యునికి అనుమతి ఈయబడింది. "పోరాటా"న్ని ఉపసంహరించుకోవాలనే అభిప్రాయం అత్యధికసంఖ్యాకులైన డిటెన్యూలు, రాజకీయ ఖైదీలు, వెలిబుచ్చారు.

అధ్యక్షుని ప్రకటన

వర్కింగ్ కమిటీ సభ్యులయిన శ్రీగోపికృష్ణవిజయవర్గీయ యీక్రింది ప్రకటన గావించాడు: "ఇదివరకే ఉద్యమం స్తంభించిపోయిఉంది. దాన్నిఉపసంహరించుకొనకపోతే, సార్వజనిక సభయొక్క రోజువారీ కార్యక్రమానికది ఆటంకంగా పరిణమిస్తుంది. ఉద్యమాన్ని మేము ఉపసంహరించనంత కాలము ప్రజలునిర్బంధ విధానానికి గురికావలసి వస్తుంది. వారికి సార్వజనికసభ ఎట్టి సేవచేసేస్థితిలో ఉండదు."

ఈవిధంగా గ్వాలియర్‌లో రాజకీయ ప్రతిష్టంభన అంతమొందింది. ఇందుకు అనుకూల పరిస్థితులెన్నో ఉన్నాయి. ప్రజానాయకుల దూరదృష్టి, ముస్లిం లీగ్ తీసుకున్న చొరవ, రాజీకి సంస్థాన ప్రభుత్వం చూపిన సంసిద్ధత, ముఖ్యమైన కారణాలు.

రైల్వే కార్మికుల ఉత్పత్తి పంధా

దేశరక్షణకు అధికోత్పత్తియెలాచేయాలో బొంబాయి రైల్వేకార్మికులు మార్గం చూపుతున్నారు.

పరేల్ రైల్వే వర్కుషాపులో కామ్రేడ్ షేర్ మహమ్మద్ ఒక కార్మికుడు. రూల్సు ప్రకారం, కార్మికులు అరగంట ఆలస్యంగా వస్తే, వారిని లోపలికి రానీయరు. జూలై 11వ తేదీని 200 మంది కార్మికులు అరగంటకంటె కూడా ఆలస్యంగా రావలసివచ్చింది. వర్షం జోరుగా కురియడంవల్ల కార్మికుల్ని తీసుకొచ్చే రైలు ఆలస్యంగా వచ్చింది. వర్కుషాపులో టైము సూపర్వైజరు ఇంగితజ్ఞానం లేని వ్యక్తి. ఆ 200 మందిని లోపలికి పోనీయకుండా ఆటంకపరచాడు. ఉత్పత్తిని కాపాడడంకంటె "రూల్"ను కాపాడడమే అతనికి ప్రధానంగా తోచింది. వెంటనే కామ్రేడ్ షేర్ మహమ్మద్ యీ 200 మందిని వర్క్సు మేనేజరువద్దకు తీసుకెళ్ళి, విషయం అంతా తెలియజెప్పి, ఈవిధంగా ప్రశ్నించాడు: "ఆలస్యంగా రావడంవల్ల మేమొకరోజు కూలి పోగొట్టుకుంటున్నామనే మాట నిజమే. కాని, దేశం 200 మంది కార్మికుల ఉత్పత్తిని పోగొట్టుకొంటూంది. ఇది మీ కిష్టమేనా?" వర్క్సు మేనేజరుకు టైము సూపర్వైజరుకంటె యింగితజ్ఞానం ఉంది. ఈ ప్రశ్న ఆయన్ని కదలించింది. కార్మికులదేశభక్తిని వర్క్సుమేనేజరు గుర్తించవలసివచ్చింది. స్పెషల్ ఆర్డరుద్వారా కార్మికుల్ని లోపలికి పంపించాడు. ఈవిధంగా కార్మికుల దేశభక్తిముందు రైల్వేయజమానుల పాడు నిబంధన పనికిరానిదయింది.

Printed and Published by Katragadda Rajaqopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE